జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | బుధవారం 17 జూన్ 2026 | సంపుటి : 16 | సంచిక : 325 | పేజీలు : 8 | వెల : 1/- | RNI NO.APTEL/2010/36516

శ్రీ పరాభవ నామ సంవత్సరం జ్యేష్ఠ మాసం ఉత్తరాయణం గ్రీష్మ ఋతువు సూర్యోదయం సూర్యాస్తమయం 5.26 6.30 శుద్ధ తదియ రా. 6.42 వరకు తదుపరి వ్యాఘాతం రా 1.40 వరకు తదుపరి తదియ యోగం పునర్వసు సా. 5.56 వరకు తదుపరి పుష్యమి కరణం తైతుల మ. 3.11 వరకు తదుపరి గరజి రాజ 2.04 వరకు తదుపరి వనజి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

# వర్షాకాల సన్నద్ధతపై ఉన్నతస్థాయి సమీక్ష

## నీటి నిల్వల నివారణకు సమన్వయ చర్యలపై క్షేత్రస్థాయి పరిశీలన

## మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జి శ్రీజన, సివి ఆనంద్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథన్





**శేరిలింగంపల్లి,జూన్ 16 (ప్రజాజ్యోతి):** వర్షాకాలంలో నీటి నిల్వలు,వరద ముప్పు అధికంగా ఉండే ప్రాంతాల్లో చేపడుతున్న నివారణ చర్యలను సమీక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సుదర్శన్ రెడ్డి నేతృత్వంలో ఉన్నతాధికారుల బృందం మంగళవారం పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించింది.ఈ పర్యటనలో డీజీపీ సి.వి.ఆనంద్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డా. జి.శ్రీజన,ఐఏఎస్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్‌తో పాటు ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ముందుగా అధికారులు రాయదుర్గంలోని మల్కం చెరువు పరిసర ప్రాంతాలను సందర్శించి,వర్షపు నీటి ప్రవాహ పరిస్థితులు,ఇన్‌లెట్ల పనితీరు,నీటి నిల్వలకు దారితీస్తున్న కారణాలు చేపడుతున్న నివారణ చర్యలను సమీక్షించారు.చెరువులో నీటి మట్టం అధికంగా ఉండటం, ఇన్‌లెట్ల వద్ద పూడిక పేరుకుపోవడం వల్ల వర్షపు నీరు చెరువులోకి సాఫీగా చేరడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు గుర్తించారు. నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలపై చర్చించారు.అనంతరం ఖాజాగూడ చెరువు పరిసర ప్రాంతాలను సందర్శించి,ఇన్‌లెట్ల వద్ద జరుగుతున్న పూడికతీత పనులు,వర్షపు నీటి కాలువల విస్తరణ మరియు నీటి పారుదల మెరుగుదల కోసం చేపడుతున్న చర్యలను పరిశీలించారు. మాధాపూర్‌లోని దుర్గం చెరువు ఇన్‌లెట్లు మరియు ఔట్‌లెట్లను పరిశీలించిన - మిగతా2లో

# ప్రతిపాదిత అభివృద్ధి పనులను పరిశీలించిన ఉప్పల్ జోన్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా ఐఏఎస్




**ఉప్పల్,జూన్16,(ప్రజా జ్యోతి)** ఉప్పల్ జోన్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా ఐఏఎస్ మంగళవారం ఉప్పల్ సర్కిల్ పరిధిలోని వెంకట్ రెడ్డి నగర్, బీరప్పగడ్డ, ప్రాంతాలలో ప్రతిపాదిత అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సూపరింటెండింగ్ ఇంజినీర్ హరి కిషోర్,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీఈఈ) ఇంజినీరింగ్ శాఖ అధికారులతో కలిసి ఆయా ప్రాంతాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల అవసరాలను పరిశీలించి, స్థానిక ప్రజలకు ఉపయోగకరంగా ఉండే విధంగా పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ ఆదేశించారు.

# చదువు పేరుతో 'ఫీజుల దోపిడీ'..!

చేవెళ్లలో ప్రైవేట్ విద్యాసంస్థల వసూళ్లపై తల్లిదండ్రుల గగ్గోలు

నర్సరీకే రూ.20 వేలు.. పదో తరగతికి లక్షల్లో భారం

పుస్తకాలు, యూనిఫాంలు కూడా తప్పనిసరి.. విద్యార్థుల కుటుంబాలపై ఆర్థిక ఒత్తిడి



# షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

- కాంగ్రెస్ నియోజకవర్గ లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి భానూరి శివశంకర్ గౌడ్
- సానుకూలంగా స్పందించిన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి



**చేవెళ్ల, జూన్ 16(ప్రజా జ్యోతి):** తోలుకట్ట గ్రామంలో క్రీడా ప్రాంగణం అభివృద్ధికి అవసరమైన షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు లాల్ బహదూర్ శాస్త్రి స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. తోలుకట్ట గ్రామ సర్వేనెంబర్ 133లోని రెండు ఎకరాల ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ క్రీడా ప్రాంగణం ఇప్పటికే మంజూరైందని, ప్రస్తుతం ఈ మైదానంలో గ్రామానికి చెందిన యువకులు క్రికెట్ ప్రాక్టీస్‌తో పాటు వివిధ క్రీడా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని వివరించారు. క్రీడాకారుల సౌకర్యార్థం మైదానంలో సెట్టర్ షెడ్ నిర్మాణానికి ప్రభుత్వ నిధులు మంజూరు చేయాలని కోరినట్లు కాంగ్రెస్ నియోజకవర్గ లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి భానూరి శివశంకర్ గౌడ్ తెలిపారు. వినతిపై స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తోలుకట్ట మాజీ సర్పంచ్, టీపీసీసీ సభ్యులు బొల్లి గిద్ద సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు వడ్ల రవీందర్ చారి, భానూరి ఇంద్రసేన గౌడ్, యాతం నాని, చనువల్లి కృష్ణ, కోమటి శ్రీను, దాసరి వినయ్, క్రికెట్ యువజన నాయకులు కేసారం శ్రీకృష్ణ, భానూరి యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులపై కేసులా..?



## స్పీకర్ తీరుపై డాక్టర్ మెతుకు ఆనంద్ ఆగ్రహం

**వికారాబాద్ ప్రతినిధి, జూన్16(ప్రజా జ్యోతి):** మర్పల్లి మండలం తుమ్మలపల్లి గ్రామంలో అభివృద్ధి పనులు అడ్డుకుంటున్నారంటూ స్పీకర్‌పై బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తీవ్ర విమర్శలు చేశారు. గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న గుంతలను ప్రభుత్వం పూడ్చకపోవడంతో ప్రజలు స్వచ్ఛందంగా శ్రమదానం చేయాలనుకుంటే కేసులు పెడతామంటూ బెదిరింపులు చేస్తున్నారని ఆరోపించారు. అదే విధంగా రైతులు పొలాలకు వెళ్లే కంతతోవలను సరిచేసుకుంటే జైలుకు పంపిస్తామంటూ హెచ్చరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "అమ్మ పెట్టదు అడుక్కోనివ్వదు అన్నట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోంది" అని విమర్శించారు. తుమ్మలపల్లిలో బీఆర్ఎస్ సర్పంచి ఉన్నందున కక్ష సాధింపు చర్యలతో ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న విధానాలను స్పీకర్ అమలు చేస్తున్నారని అన్నారు. ఈ సమస్యలపై వికారాబాద్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించినట్లు డాక్టర్ ఆనంద్ తెలిపారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.



# నేడు ఈ గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ధారూర్, జూన్ 16( ప్రజా జ్యోతి):** 33 కేవీ విద్యుత్ లైన్ మరమత్తులలో భాగంగా మున్నూరు సోమారం సబ్ స్టేషన్ లో విద్యుత్ కు అంతరాయం ఏర్పడనున్నాదని ట్రాన్స్ కో ఏఈ వేణుగోపాల్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మున్నూరు సోమారం సబ్ స్టేషన్ పరిధి గ్రామాలకు కొండాపూర్ కాలన్, ధర్మపూర్, ఏబ్బనూర్, కేరెల్లి, కొండాపూర్ కుర్దు, గోధుమగూడ, జైదుపల్లి, నాచారం గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

# అనంతగిరిపై కలెక్టర్ ఫోకస్

- పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించండి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ దీపక్ తివారి




వికారాబాద్ ప్రతినిధి, జూన్ 16( ప్రజా జ్యోతి): జిల్లాలో పర్యాటక అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్న ప్రాంతాలను గుర్తించి సమగ్ర ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులకు ఆదేశించారు.
మంగళవారం అనంతగిరి పర్యావరణ పర్యాటక కేంద్రం అభివృద్ధి పనులపై నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనంతగిరి ప్రాంతంతో పాటు సర్పన్‌పల్లి, కోట్‌పల్లి ప్రాజెక్ట్ ప్రాంతాలను పర్యాటక అభివృద్ధి దిశగా పరిశీలించాలని సూచించారు. జిల్లాలోని ఆధ్యాత్మిక, సహజ సౌందర్య ప్రదేశాలను గుర్తించి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా మున్సిపాలిటీల అభివృద్ధికి సంబంధించి మాస్టర్ ప్లాన్‌లను సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు.
ఈ సమీక్ష సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) సచిన్ బస్వరాజ్ గుట్టూరు, పర్యాటక, అటవీ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్సులు రద్దు

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్ ప్రతినిధి, జూన్ 16( ప్రజా జ్యోతి):** ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే వారి లైసెన్సులను రద్దు చేస్తామని జిల్లా కలెక్టర్ దీపక్ హెచ్చరించారు. మంగళవారం వికారాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ధనలక్ష్మి ఫర్టిలైజర్ దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధరల పట్టికలు, నిల్వల రిజిస్టర్‌ను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయాలు జరగాలని ఆయన ఆదేశించారు. అక్రమాలకు పాల్పడిన డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులు అధిక శాతంలో పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పారిశుధ్య పనులు నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. గత సంవత్సరం ఉత్తీర్ణత శాతంపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బాలుర వసతి గృహంలో అడ్మిషన్లు ప్రారంభం



**చౌడాపూర్ మండల్ (ప్రజా జ్యోతి)జూన్ 16 :** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్ర పరిధిలోని మరికల్ గ్రామంలో షెడ్యూల్డ్ కులాల ప్రభుత్వ బాలుర వసతి గృహంలో మూడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభం అవ్వడం జరిగింది. కావున జిల్లా,మండల పరిధిలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని వసతి గృహ సంక్షేమ అధికారి నరేందర్ రెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలియజేయడం జరిగింది. వసతి గృహంలో ప్రతిరోజు అరటి పండ్లు,గుడ్లు, వారానికి రెండుసార్లు మాంసాహారం,ప్రతినెల సబ్బులు,నూనెలు,కటింగ్ చార్జెస్ కలిపి 200 రూపాయలు ఇవ్వబడును అని తెలపడం జరిగింది. నిరుపేద విద్యార్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ప్రెస్ మీట్ ద్వారా తెలియజేయడం జరిగింది.

# అనాధ పిల్లల మధ్య కౌన్సిలర్ కొత్త గొల్ల సోమశేఖర్ కూతురు సమృద్ధి 5వ పుట్టినరోజు వేడుకలు

పిల్లలకు చేతివ్రత పుస్తకాలు పంపిణీ



**మోమిన్ పేట్. జూన్ 16 (ప్రజా జ్యోతి )** మో మిన్ పేట్ మండలం లో గల హెల్ప్ఆల్ సొసైటీ లో గల అనాధ పిల్లల మధ్య సంగారెడ్డి జిల్లా సదాశివపేట పురపాలక సంఘంలోని 8వ వార్డుకు చెందిన కౌన్సిలర్ కొత్తగొల్ల సోమశేఖర్ కూతురు సమృద్ధి 5వ పుట్టినరోజు వేడుకలను కేక్ కట్ చేసి అనాధ పిల్లల మధ్య జరుపుకున్నారు. పిల్లలు పాపకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనాధ పిల్లలకు చేతి వ్రాత పుస్తకాలు పంపిణీ చేశారు , వారికి భోజన వసతి కల్పించారు . ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా సదాశివపేట పురపాలక సంఘం లోని 8వ వార్డు చెందిన కౌన్సిలర్ కొత్త గొల్ల సోమశేఖర్ మాట్లాడుతూ మా పాప పుట్టినరోజు హెల్ప్ ఆల్ సొసైటీ లో గల అనాధ పిల్లల మధ్య జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని ఈ విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు . ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బంధువులు, హెల్ప్ ఆల్ సొసైటీ సిబ్బంది ,విద్యార్థులు తదితరులు పాల్గొనడం జరిగింది

# వికారాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ

- ఎస్పీ స్నేహ మెహ్రా




**వికారాబాద్ ప్రతినిధి, జూన్ 16( ప్రజా జ్యోతి):** వికారాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ స్నేహ మెహ్రా, మంగళవారం వికారాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ ఆవరణ, రిసెప్షన్, లాకప్ గదులతో పాటు పరిసరాలను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లోని ముఖ్య రికార్డులు, బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ వాహనాల నిర్వహణ, వివిధ కేసుల ఫైళ్లను తనిఖీ చేసి పెండింగ్ కేసుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో సిబ్బంది మర్యాదపూర్వకంగా, బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, బాధితుల ఫిర్యాదులపై తక్షణ స్పందన ఉండాలని, వారికి త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రాత్రి గస్తీని మరింత బలోపేతం చేయాలని, పట్టణంలో నేరాల నియంత్రణకు సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణను క్రమం తప్పకుండా నిర్వహించాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా, సిబ్బంది విధులతో పాటు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, మానసిక ఒత్తిడిని తగ్గించుకునే విధంగా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని పేర్కొన్నారు. పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం పనితీరును మెరుగుపరుస్తుందని తెలిపారు. ప్రజల్లో పోలీసు శాఖపై నమ్మకం పెంపొందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ స్నేహ మెహ్రా సిబ్బందిని ఆదేశించారు.

# ఏబ్బనూర్లో జల్ జీవన్ మిషన్ కార్యక్రమం

**"హర్ ఘర్ జల్" గ్రామంగా ఏబ్బనూర్**



**ధారూర్, జూన్ 16( ప్రజా జ్యోతి):** జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఏబ్బనూర్ గ్రామంలో మంగళవారం జల్ మహోత్సవ కార్యక్రమన్నీ ఆర్డబ్ల్యూఎస్, గ్రిడ్ అధికారులు నిర్వహించారు.గ్రామ సర్పంచ్ బి. సమిత అధ్వర్యంలో గ్రామంలో ర్యాలీనీ నిర్వహించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ తాగునీటిని జాగ్రత్తగా వినియోగించుకోవడం, సరఫరా చేస్తున్న నీటిని సంరక్షించుకోవడం మన అందరి బాధ్యత అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డబ్ల్యూక్యూఎం (ఔవీ) ల్యాబ్ సిబ్బంది గ్రామస్తులకు త్రాగునీటి నాణ్యత గురించి వివరించి, నీటి నమూనాలపై కొన్ని పరీక్షలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామాన్ని "హర్ ఘర్ జల్" గ్రామంగా ప్రకటించారు, జల్ జీవన్ గ్రామంలోని అన్ని ఇళ్లకు (100%) ట్యాప్ కనెక్షన్లు కల్పించబదాయన్నారు. గ్రామంలో 2.58 కిలోమీటర్ల పైప్లైన్ వేయించి 259 ఇళ్లకు ట్యాప్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. గ్రామంలో నిర్మించిన ఆర్డబ్ల్యూఎస్ ఆస్తులను పంచాయతీకి అప్పగించామని చెప్పారు. 40 కే.ఎల్ ట్యాంక్(ఖూ) కట్టడం జరిగిందన్నారు.ల గ్రామానికి గ్రిడ్ ద్వారా త్రాగునీటి సరఫరా క్రమం తప్పకుండా జరుగుతోందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఇంట్రా డీఈఈ వి. రత్న ప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ ఎం. రాఘవేంద్ర, గ్రిడ్ డీఈఈ విజయ్ కుమార్, గ్రిడ్ ఏఈఈ విపుల్ తివారీ, ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది, డబ్ల్యూక్యూఎం ల్యాబ్ సిబ్బంది గ్రామ కార్యదర్శి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# కోళ్ల ఫామ్ కార్మికులకు షీ టీం అవగాహన కార్యక్రమం..

మహిళల భద్రత, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణాపై చైతన్యం




**దోమ జూన్ 16 (ప్రజాజ్యోతి) :** వికారాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో దోమ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖమ్మం నాచారం సమీపంలోని కోళ్ల ఫామ్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా, పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పరిగి సబ్ డివిజన్ షీ టీం ఇంచార్జ్ నర్సిములు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం, డయల్-100, మహిళల సహాయ నంబర్-181, సీసీ కెమెరాల ప్రాధాన్యత, బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, బ్యాంకింగ్ మరియు ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, సైబర్ నేరాలు మరియు సైబర్ హెల్ప్‌లైన్ 1930 గురించి విస్తృతంగా అవగాహన కల్పించారు.సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమని, ఎలాంటి నేరాలు లేదా అనుమానాస్పద సంఘటనలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కోళ్ల ఫామ్ మేనేజర్ మణికంఠ, కార్మికులు, షీ టీం సభ్యులు సావిత్రి, శోభ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇండ్లు, స్థలాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలి

- టిడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు రామ్ చందర్ వినతి



**వికారాబాద్ ప్రతినిధి, జూన్ 16(ప్రజా జ్యోతి):** అర్హులైన ప్రతి జర్నలిస్టులకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి. రాంచందర్, జిల్లా కార్యదర్శి ఎండి. షఫీలు కోరారు. ఈ మేరకు మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని స్పీకర్ క్యాంపు కార్యాలయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో విలేకరుల సేవలు అత్యంత ముఖ్యమని తెలిపారు. గౌరవ వేతనం లేకపోయినా సామాజిక బాధ్యతతో పని చేస్తున్న జర్నలిస్టుల సేవలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ఇండ్లు, స్థలాలు, హెల్త్ కార్డుల విషయంలో ప్రభుత్వ హామీలు అమలు కాలేదని, సొంత ఇళ్లు లేక అద్దె భారం భరించలేక జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత కల్పించే హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమాజానికి సేవలందిస్తున్న జర్నలిస్టులకు మెరుగైన వైద్య సదుపాయాలు అవసరమని పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకట్ రామ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు హఫీజ్ ఖాన్, గణపురం శ్రీనివాస్, ఎం. వెంకటేష్, పుటుక అనంతయ్య, మొగులయ్య, ఎం. రమేష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# మోమిన్‌పేట్ మండలంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన



**మోమిన్ పెట్ జూన్ 16 ప్రజా జ్యోతి )** కల్పించేందుకు తేదీ 17-06-2026 (బుధవారం) ఉదయం 7:00 గంటలకు 2ఖ రన్ కార్యక్రమం నిర్వహించబడు తుంది. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ అధికారులు వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, యువత, ప్రజాప్రతినిధులు మరియు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొననున్నారు. ఓటరు నమోదు, ఓటరు వివరాల సవరణ, తొలగింపు మరియు మార్పులకు సంబంధించిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం, తన ఓటరు వివరాలను సక్రమంగా ఉంచుకోవడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా తెలియజేయబడుతోంది. కావున మండల ప్రజలు, యువత మరియు సంబంధిత అధికారులు ఈ 2ఖ రన్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరడమైనది.

# బషీరాబాద్ మండలంలో పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**బషీరాబాద్ జూన్ 16 ప్రజా జ్యోతి** బషీరాబాద్ మండలంలో పలు గ్రామాలలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 11 కేవీ అగ్గనూర్ పీడర్ పరిధిలో ఉన్న చెట్ల కొట్టివేత (ట్రీ కటింగ్) పనులు చేయడం జరుగుతుందని ఈ నేపథ్యంలో బుధవారం 17 న ఉదయము 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయునట్లు తాండూర్ ఏడీఈ ఒక ప్రకటన తెలిపారు. ఆ గ్రామాలు జీవన్గి,గంగ్వార్, క్యాద్గిర నవాంద్గి,కొర్విచెడ్,మాసాన్ పల్లి,ఇందర్ చేడ్, గ్రామంలో విద్యుత్ అంతరాయం కలుగనున్నది. వినియోగదారులు సహకరించాలని విద్యుత్ అధికారులు కోరారు.

# అకౌంట్ అగ్రిగేటర్ వ్యవస్థకు ఎస్ఆర్వోగా సహమతికి ఆర్బీఐ గుర్తింపు

**హైదరాబాద్, జూన్ 16 (ప్రజా జ్యోతి) :** భారత అకౌంట్ అగ్రిగేటర్(ఏఏ) వ్యవస్థ కోసం సహమతి సంస్థను భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్బీఐ) అధికారికంగా సెల్ఫ్-రెగ్యులేటరీ ఆర్గనైజేషన్(ఎస్ఆర్వో)గా గుర్తించిందని ప్రతినిధులు మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ వినియోగదారుల సమ్మతి ఆధారంగా ఆర్థిక సమాచార బదిలీ జరిగే ఏఏ వ్యవస్థ నిర్వహణ, క్రమశిక్షణ, పరిశ్రమ సమన్వయాన్ని బలోపేతం చేయడమే ఈ నిర్ణయ లక్ష్యమని తెలిపిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఏఏ ఎకోసిస్టమ్‌లో 1,120కు పైగా నియంత్రిత ఆర్థిక సంస్థలు, 176 ఫైనాన్షియల్ ఇన్ఫర్మేషన్ ప్రొవైడర్లు(ఎఫ్ఐపీలు), 1,020 ఫైనాన్షియల్ ఇన్ఫర్మేషన్ యూజర్లు(ఎఫ్ఐయులు), 17 అకౌంట్ అగ్రిగేటర్లు భాగస్వాములుగా ఉన్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 45 కోట్లకు పైగా సమ్మతి అభ్యర్థనలు, 29 కోట్లకు పైగా ఖాతాల అనుసంధానం నమోదయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా సహమతి చైర్మన్ ఆర్.గాంధీ మాట్లాడుతూ ఏఏ ఫ్రేమ్‌వర్క్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో సమాచార బదిలీ విధానాన్ని పూర్తిగా మార్చిందన్నారు. సహమతి సీఈఓ బి.జి.మహేష్ మాట్లాడుతూ ఈ గుర్తింపుతో ఓపెన్ ఫైనాన్స్ రంగంలో భారతదేశ నాయకత్వం మరింత బలపడుతుందని తెలిపారు.

# శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ప్రధాన ద్వారం ప్రారంభోత్సవం



అబ్దుల్లాపూర్ మెట్టు జూన్ 16 (ప్రజాజ్యోతి) గాయత్రీ పురం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో మంగళవారం నూతనంగా నిర్మించిన భవనం,ఆలయ ప్రధాన ముఖద్వారాన్ని ఘనంగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ వరసిద్ధి వినాయక ఆలయ కమిటీ అధ్యక్షుడు దుద్దిల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీ వరసిద్ధి వినాయక దేవాలయానికి ఆదాయం తక్కువగా ఉంటుందన్నారు. కాలనీకి చెందిన కొందరు దాతలు ముందుకు వచ్చి ప్రతి వారం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తారన్నారు.ఈ ఆలయం దగ్గర ప్రతి వారానికి ఒకసారి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఆలయం పైన ఫంక్షన్ హాల్ నిర్మించాలని ఆలోచన ఉన్నదని ఫంక్షన్ హాల్ నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళంగా వచ్చిన దాతలకు వారి ఫోటోలను ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.ఈ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి సుమారు 25 లక్షల నుండి 30 లక్షల వరకు ఖర్చు అవుతుందన్నారు. దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ జనరల్ సెక్రెటరీ కె నవీన్ కుమార్, ట్రెజర్ అనంతరాములు, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి బడిబాట

సిద్దాపూర్ సర్పంచ్ బాసు నాయక్

సిద్దాపూర్ లో విస్తృతంగా బడిబాట కార్యక్రమం






**కొత్తూర్ జూన్ 16 (ప్రజా జ్యోతి)** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని సిద్దాపూర్ సర్పంచ్ బాసు నాయక్ అన్నారు. కొత్తూరు మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో సర్పంచ్ బాసు నాయక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు 21 రకాల వస్తువులతో కిట్లు అందజేయబడతాయని ఆయన తెలిపారు.అలాగే ఉదయం టిఫిన్,మధ్యాహ్నం భోజనం గుడ్లు,రాగి జావ,పాలు వంటి పోషకాహారం అందించడంతో పాటు నాణ్యమైన విద్య అందించబడుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రఘుపాల్,ఉపసర్పంచ్ దోబ్బల యాదయ్య, వాటి సభ్యులు జ్యోతి,స్రవంతి,వివోఏ జంగయ్య, నాయకులు నరేందర్ రెడ్డి,శ్రీధర్ చారి,పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఏకో టౌన్ డంపింగ్ యార్డ్ ఉపసంహరించుకోవాలంటూ మంత్రులకు వినతిపత్రం



**అబ్దుల్లాపూర్ మెట్టు జూన్16(ప్రజాజ్యోతి)** అబ్దుల్లాపూర్మెట్ మండలం పరిధిలోని చిన్న రావిరాల రెవెన్యూ పరిధిలోని బండ రావిరాలలో ఏర్పాటు చేయనున్న ఏకో టౌన్ (డంపింగ్ యార్డ్) ను తక్షణమే ఉపసంహరించుకోవాలంటూ చిన్న రావిరాల గ్రామపంచాయతీ సర్పంచ్ పబ్బతి బాలకిషన్ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్, రోడ్లు భవనాలు సినీ మాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి లను కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 గ్రామాల ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపే జీవో 20ని వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లాయిపల్లి సర్పంచ్ మెరుమాండ్ల మహాలక్ష్మి దానయ్య, జగత్ పల్లి సర్పంచ్ ఇట్టేమోని గీత మహేష్ యాదవ్, డిసిసి ఉపాధ్యక్షులు కళ్లెం రాఘవరెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ గౌడ్, పిల్లాయిపల్లి ఉపసర్పంచ్ బందారపు లక్ష్మణ్ గౌడ్, బండ రావిరాల మాజీ సర్పంచ్ కవాడి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ దంతూర మహేందర్ గౌడ్, కళ్లెం శ్రీధర్ రెడ్డి, కళ్లెం ధర్మారెడ్డి, ములుగు అర్జున్, పల్లపు సురేష్,ఓరుగంటి శివ, గడ్డం ప్రవీణ్ గౌడ్, నారెడ్డి సతీష్ రెడ్డి, గండికోట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ సర్కిల్ లో వర్షాకాల సన్నద్ధత పనుల పరిశీలన

సమస్యాత్మక ప్రాంతాల్లో చర్యలు వేగవంతం

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి





**ఉప్పల్, జూన్16,(ప్రజా జ్యోతి):** సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు వేగవంతంగా చేయాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం రోజున రామంతాపూర్ మోడ్రన్ బేకరీ, దేవేందర్ నగర్ రోడ్డు ప్రాంతాల్లో అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. మొదట రామంతాపూర్ రోడ్ మోడ్రన్ బేకరీ సమీపంలో వర్షం పడితే నీరు నిల్వ ఉండే ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. భారీ వర్షాల సమయంలో నీరు నిల్వ కాకుండా చేపడుతున్న చర్యలు, ప్రస్తుతం ఉన్న డ్రైనేజీ వ్యవస్థ పనితీరు, వర్షపు నీటి పారుదల పరిస్థితులను అధికారులు వివరించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశించారు. అలాగే రామంతాపూర్ దేవేందర్ నగర్ రోడ్ వెంట ఉన్న ప్రధాన నాలాను కమిషనర్ పరిశీలించారు. నాలా నీటి ప్రవాహ సామర్థ్యం, కొనసాగుతున్న నిర్వహణ పనుల పురోగతి, వర్షపు నీటి పారుదల పరిస్థితులను సమీక్షించారు. వర్షాకాలంలో ఎలాంటి అవరోధాలు లేకుండా నీటి ప్రవాహం కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలో వరద ముప్పును తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. ఈ తనిఖీలలో ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, ఎంఎంసీ చీఫ్ ఇంజనీర్ అశోక్ రెడ్డి, ఎంఎంసి హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఈడీ పంకజ, ఉప్పల్ జోన్ హైడ్రా ఎస్ ఎఫ్ ఓ మోహన్ రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) కార్యక్రమముపై బూత్ లెవెల్ ఆఫీసర్స్ శిక్షణ సమావేశం



**ఉప్పల్,జూన్ 16,( ప్రజా జ్యోతి ):** ఉప్పల్ జోన్, జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, ఐఏఎస్ అధ్యక్షతన మంగళవారం ఉప్పల్ జోనల్ కార్యాలయంలో బూత్ లెవల్ ఆఫీసర్లు (బీూం) సూపర్వైజర్లకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) కార్యక్రమంపై శిక్షణా సమావేశం నిర్వహించబడింది.గురువారం నుండి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) కార్యక్రమం విజయవంతం గా నిర్వహించేందుకు బ్యాచ్‌ల వారీగా 10 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను ఖచ్చితత్వం తో నిర్వహించాలని సూచించారు. ఫీల్డ్ స్థాయిలో ఇంటింటి సర్వేను బాధ్యతాయుతంగా నిర్వహించి, అర్హులైన ప్రతి ఓటరును నమోదు చేయడంతో పాటు తప్పులు, డూప్లికేట్లు అనర్హత నమోదులను గుర్తించి సరిదిద్దాలని ఆదేశించారు. సూపర్వైజర్లు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, బి ఎల్ ఓ లకు (బీూ) అవసరమైన మార్గనిర్దేశం అందించాలని జోనల్ కమిషనర్ సూచించారు.ఈ కార్యక్రమంలో అన్ని సర్కిళ్లకు చెందిన సూపర్వైజర్లు, బి ఎల్ ఓ లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మైసమ్మ నగర్‌లో రూ.4 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన బోరుబావి మోటార్ ప్రారంభం

ప్రజలకు నీటి సమస్య లేకుండా చేస్తామని నేతల హామీ



**కుత్బుల్లాపూర్ జూన్ 16(ప్రజా జ్యోతి )** జెకె శేఖర్ యాదవ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మైసమ్మ నగర్ బి బ్లాకులో దుర్గామాత గుడి వద్ద ఎంపీ ఈటల రాజేందర్ నాలుగు లక్షల నిధులతో ఏర్పాటు చేసిన బోరుబావి మోటార్ను బిఎస్ మల్లారెడ్డి ఇన్చార్జి అధ్యక్షులు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించినారు వారితోపాటు అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్ మరియు వారు మాట్లాడుతూ ప్రజలకు నీటి కొరత లేకుండా చేయడమే తమ దేయమని ఎంపీ సహాయ సహకారల తోటి గుట్టలో ఉన్న సమస్యలన్నీ పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్ రావుల శేషగిరి , జిల్లా ఉపాధ్యక్షులు గరిగ శేఖర్ ముదిరాజ్, బావిగడ్డ రవి , డివిజన్ అధ్యక్షులు పున్నారెడ్డి, సిద్ధిరాం రెడ్డి, బస్తీ అధ్యక్షులు బసవప్ప ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్ యాదవ్ నాని పాపిరెడ్డి ప్రమోద్ మరియు బస్తివాసులు తదితరులు పాల్గొన్నారు.

# "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా బేగంపేట్‌లో ట్రాఫిక్ అవగాహన సదస్సు

. రహదారి భద్రతపై ఉద్యోగులకు అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసులు




**బోయిన్ పల్లి, జూన్ 16.(ప్రజా జ్యోతి):** రహదారి ప్రమాదాలను తగ్గించేందుకు చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రకాశ్‌నగర్‌లోని శాంసంగ్ డివిజనల్ కార్యాలయంలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్-1) కె. రాహుల్ రెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా రహదారి భద్రతకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. అతివేగం వల్ల సంభవించే ప్రమాదాలు, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే దుష్పరిణామాలు, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం వల్ల ఎదురయ్యే ప్రమాదాలను వివరించారు. అలాగే హెల్మెట్, సీట్‌బెల్ట్‌ల వినియోగం, లేన్ క్రమశిక్షణ పాటించడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పనిసరిగా అనుసరించడం వంటి అంశాలపై ప్రత్యేకంగా సూచనలు చేశారు.కార్యక్రమంలో జి. జానకి రాములు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ట్రాఫిక్ పీఎస్ బేగంపేట్, రామకృష్ణ, మేనేజర్, శాంసంగ్ డివిజన్, బేగంపేట్, సంస్థ సిబ్బంది, అలాగే ఎం.డి. సాదిక్, మేనేజర్, టాటా మోటార్స్, బేగంపేట్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాల్గొన్న ఉద్యోగులు ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై చురుకుగా చర్చించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్లు ఏసిపి శంకర్ రాజ్ తెలిపారు.

# బొల్లారం సదర్ బజార్ ప్రభుత్వ పాఠశాలలో బ్రేక్‌ఫాస్ట్ ఢ మిల్క్ పథకానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే శ్రీగణేష్





**బోయిన్ పల్లి, జూన్ 16.(ప్రజా జ్యోతి):** వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బ్రేక్‌ఫాస్ట్ ఢ మిల్క్ పథకాన్ని బొల్లారం సదర్ బజార్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఎమ్మెల్యే శ్రీగణేష్ లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్యంతో పాటు విద్యాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో రాణించగలరు అనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఈ పథకాన్ని తీసుకువచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి ప్రతిరోజూ పోషకాహారంతో కూడిన అల్పాహారం, పాలు అందించడం ద్వారా పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది అని పేర్కొన్నారు.అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసి వారితో ముచ్చటించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు రామలింగారెడ్డి, విక్రమాదిత్యతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వర్షాకాల సన్నద్ధతపై ఉన్నతస్థాయి సమీక్ష

-మొదటిపేజీ తరువాయి
అధికారులు, చెరువులో ఇప్పటికే నీటి నిల్వలు అధికంగా ఉండటంతో వర్షపు నీరు సాఫీగా ప్రవహించడంలో ఎదురవుతున్న సమస్యలను సమీక్షించారు. మురుగునీరు మరియు వర్షపు నీటి ప్రవాహాల నిర్వహణలో మరింత సమన్వయం అవసరమని గుర్తించి, చెరువు ఔట్‌లెట్ల సామర్థ్యాన్ని పెంచే అంశాన్ని పరిశీలించారు.విఠల్‌రావు నగర్ ప్రాంతంలో ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చిన వర్షపు నీటి కాలువల పనితీరును పరిశీలించిన అధికారులు,నీటి నిల్వలకు కారణమవుతున్న అడ్డంకులను గుర్తించి వాటి తొలగింపుపై సూచనలు చేశారు.అలాగే కొండాపూర్ సంతోష్ దాబా సమీపంలో కొనసాగుతున్న పూడికతీత పనులు, మొండికుంట వైపు వర్షపు నీటి ప్రవాహ పరిస్థితులు జూబ్లీ గార్డెన్స్ ప్రాంతంలో హైడ్రా చేపడుతున్న కాలువల శుభ్రపరిచే పనులను సమీక్షించారు.అనంతరం అధికారులు మియాపూర్‌లోని గురునాథ్ చెరువు ఇన్‌లెట్లను సందర్శించి, ఇటీవల చేపట్టిన పూడికతీత పనులు మరియు వరద కాలువల పునరుద్ధరణ చర్యలను పరిశీలించారు.గతంలో ఆక్రమణల కారణంగా దెబ్బతిన్న నీటి ప్రవాహ మార్గాలను పునరుద్ధరించడం ద్వారా చెరువుకు వర్షపు నీరు సాఫీగా చేరే పరిస్థితులు మెరుగుపడినట్లు అధికారులు తెలిపారు.చందానగర్‌లోని గంగారం చెరువు పరిసర ప్రాంతాల్లో కూడా అధికారులు పర్యటించి,పూడికతో నిండిపోయిన కాలువల కారణంగా ప్రధాన రహదారులపై నీటి నిల్వలు ఏర్పడుతున్న అంశాన్ని సమీక్షించారు. పూడికతీత పనులను వేగవంతం చేసి,వర్షపు నీటి పారుదల వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... చెరువుల ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లు మరియు అనుసంధాన వర్షపు నీటి కాలువలను క్రమం



తప్పకుండా నిర్వహించడం ద్వారా నీటి నిల్వలు మరియు వరద ముప్పును గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.గుర్తించిన సమస్యలకు శాశ్వత పరిష్కారాలు అమలు చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.డీజీపీ సి.వి.ఆనంద్ మాట్లాడుతూ

...పనుల అమలులో ఎటువంటి అవరోధాలు ఎదురైనా సంబంధిత శాఖలు పోలీస్ శాఖ సహకారం తీసుకోవచ్చని పేర్కొన్నారు. రహదారులపై నీటి నిల్వలు ఏర్పడితే ట్రాఫిక్ సమస్యలు తీవ్రతరమవుతాయని, అందువల్ల అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్,హైడ్రా, పోలీస్,ఇరిగేషన్, జీహెచ్ఎంసీ,ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన నివారణ,ఉపశమన చర్యలను వేగవంతం చేస్తున్నాయని అధికారులు తెలిపారు.

# స్ట్రీట్ వెండర్స్ సమస్యను పరిష్కరించిన కొండ విశ్వేశ్వర్ రెడ్డి

## -బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్చార్జి రవికుమార్ యాదవ్





**శేరిలింగంపల్లి,జూన్ 16 (ప్రజాజ్యోతి):** మియాపూర్ డివిజన్, న్యూ కాలనీ శివాలయం ఎదురుగా ఉన్న గ్రౌండ్ వద్ద ప్రతి మంగళవారం నిర్వహించే మార్కెట్ స్ట్రీట్ వెండర్స్ ను అడ్డుకున్న సిఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు, మార్కెట్ ప్రాంతానికి చేరుకుని సీఆర్పీఎఫ్ కేంద్ర అధికారులతో మాట్లాడి స్ట్రీట్ వెండర్స్ సమస్య పరిష్కరించిన... చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్.మియాపూర్ డివిజన్, న్యూ కాలనీ శివాలయం వద్ద ఉన్న గ్రౌండ్ లో గత 20 సంవత్సరాలు గా ప్రతి మంగళవారం కురాగాయలు,పండ్లు,చిన్న వ్యాపారాలతో బ్రతుకుతున్న స్ట్రీట్ వెండర్స్ ను షాప్ పెట్టనీయకుండా సి.ఆర్.పీ.ఎఫ్ వారు,స్థానిక పోలీసులు అడ్డుకుంటున్నారని తెలియగా వెళ్లి స్ట్రీట్ వెండర్స్ మాట్లాడి సమస్యను తెలుసుకుని సీఆర్పీఎఫ్ కేంద్ర అధికారులతో మాట్లాడి ప్రతి మంగళవారం వారి వ్యాపారాలు అక్కడే జరుపుకునేలా చర్యలు తీసుకున్న ...చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి,బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుండి ఇదే ప్రాంతంలో ప్రతి మంగళవారం స్ట్రీట్ వెండర్స్ మార్కెట్ ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహించకుంటూ బ్రతుకుంటున్నారని, వారు ప్రతి రోజు వేరే వేరే ప్రాంతాలలో మార్కెట్ ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారని,ఇక్కడ వ్యాపారాలు నిర్వహించే అందరూ పేద వారని వీళ్ళను అడ్డుకున్న వాళ్ళు మొన్న రేవంత్ రెడ్డి మీటింగ్ కు ఏ విధంగా అనుమతించారని ప్రశ్నించారు, సంబంధిత అధికారులతో మాట్లాడి ఇదే ప్రాంతంలో వ్యాపారాలు నిర్వహించే విధంగా అనుమతులు ఇప్పించడం జరిగింది,ఈ విషయమై వ్యాపారులు ఎంపీ గారికి, రవి కుమార్ యాదవ్ కి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మహేష్ యాదవ్, లక్ష్మణ్,గణేష్, పట్టాభిరామ్,పవన్, విజయేందర్, శ్రీనివాస్ ,రాము, బసవ శివ, శ్రీనివాస్ యాదవ్,ప్రసాద్ , మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# గృహ కార్మికుల హక్కుల కోసం ఇందిరా పార్క్‌లో భారీ ధర్నా





**“డొమెస్టిక్ వర్క్ ఈజ్ వర్క్” నినాదంతో 500 మంది మహిళల ఆందోళన**

**.గృహ కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన తెలంగాణ డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్**

**బోయిన్ పల్లి, జూన్ 16.(ప్రజా జ్యోతి):** అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ) అధ్యక్షురాలు ఆన్ జోసెఫ్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. “డొమెస్టిక్ వర్క్ ఈజ్ వర్క్” అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ నుంచి సుమారు 500 మంది మహిళా గృహ కార్మికులు పాల్గొని తమ సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ పాల్గొని గృహ కార్మికులకు సంఘీభావం తెలిపారు.గృహ కార్మికులు తమకు ఎదురవుతున్న సమస్యలను వివరించడంతో పాటు పలు కీలక డిమాండ్లను ప్రభుత్వ ముందుంచారు.

**ప్రధాన డిమాండ్లు**

గృహ కార్మికులకు ఈఎస్ఐ ( ఈ ఎస్ ఐ) సౌకర్యం కల్పించాలి.

గృహ కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత కోసం సమగ్ర చట్టం తీసుకురావాలి.

సొంత ఇల్లు లేని గృహ కార్మికులకు గృహ వసతి కల్పించాలి.

అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ ఎల్ ఓ) కన్వెన్షన్-189ను అమలు చేయాలి.ధర్నా అనంతరం గృహ కార్మికుల ప్రతినిధులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్‌లకు అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సమాజానికి గృహ కార్మికులు అందిస్తున్న సేవలను గుర్తించి, వారి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం తగిన




చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి డివిజన్ ఇన్‌చార్జ్ నిర్మల, గీత, పద్మ, మేరీ తదితరులు పాల్గొన్నారు.

# గోశాలకు పచ్చగడ్డి,కూరగాయలు అందజేత

## మార్వాడి సంఘం యువ నాయకుడు అరవింద్ మీర్జా






**కొత్తూర్ జూన్ 16 (ప్రజా జ్యోతి)** శంషాబాద్ మండలంలోని పాలమాకుల దయాన్ ఫౌండేషన్ గోశాలకు మార్వాడి సంఘం సభ్యుడు అరవింద మీర్జా, సంఘం సభ్యులు కలిసి ఒక డీసీఎం పచ్చ గడ్డి,కూరగాయలు ఇచ్చి మూగజీవాలపై తన ఉదారతను చాటుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఈ మూగజీవాలకు పచ్చగడ్డి, కూరగాయలు దానంచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు మార్వాడి సంఘం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్వాడి సంఘం సభ్యులు మనోజ్,వైష్ణవ్,పవన్ శర్మ,దినేష్ శర్మ,భీమ్ కుమార్,కాలు శర్మ, శంకర్ సింగ్,రాజ్ కుమార్ శర్మ, వినోద్ శర్మ,తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ని కలిసిన బాలాజీ ఎంక్లేవ్ కాలనీ నూతన సంక్షేమ సంఘం సభ్యులు



**ఉప్పల్,జూన్ 16,(ప్రజా జ్యోతి)** బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని బాలాజీ ఎన్క్లేవ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ వాసుల ఏకగ్రీవ నిర్ణయంతో వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షుడిగా,ఓంకార్ సింగ్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఓంకార్ సింగ్ తమ కార్యవర్గ సభ్యులతో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా బాలాజీ ఎన్క్లేవ్ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి, కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. కాలనీ ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో నూతన కమిటీ సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం కోసం కమిటీ చేపట్టే ప్రతి మంచి కార్యక్రమానికి తన పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గం: అధ్యక్షుడు, వేణుగోపాల్ రెడ్డి ప్రధాన కార్యదర్శి, ఓంకార్ సింగ్ ఉపాధ్యక్షుడు,సిహెచ్. ప్రవీణ్ రావు జాయింట్ సెక్రటరీ,సిద్దేశ్వర్ ట్రెజరర్, పీజీ వెంకటేశ్వర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు, శరభయ్య, డి. శంకర్, శ్రీనివాస చారి, గౌతమ్, సాయికుమార్ బాలాజీ ఎన్క్లేవ్ అభివృద్ధి, కాలనీ వాసుల సంక్షేమం కోసం నూతన కార్యవర్గం సమిష్టిగా కృషి చేస్తుందని సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

# మాచబొల్లారం 191వ డివిజన్ సమస్యల పరిష్కారానికి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి

## డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాల సమస్యలపై సాయిబాబా నగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల



**అల్వాల్, జూన్ 16 (ప్రజా జ్యోతి) :** మాచబొల్లారం 191వ డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ను కాలనీ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీలో మౌలిక వసతుల కొరత కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతల మాణిక్య రెడ్డి, సూర్య, సాయిబాబా నగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు బంగారరెడ్డి, సభ్యులు సత్యనారాయణ, శాలివాహన్, సమ్మిరెడ్డి, వరుణ్ కుమార్, డి. శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పలు కాలనీలలో సమస్యలను పరిష్కరిస్తా

## ఈస్ట్ శ్రీనివాస్పురం మధుర నగర్ రామ్ శంకర్ నగర్ కాలనీలో సమస్యల పరిష్కారం

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న యూత్ కాంగ్రెస్ నాయకులు ఆకారపు అరుణ్ పటేల్





**ఉప్పల్,జూన్16,(ప్రజాజ్యోతి)** వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ కాలనీల సమస్యలను పరిష్కరించి, ప్రజల ఇబ్బందులను తీర్చిన ఉప్పల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వెంక రెడ్డి నగర్ డివిజన్ ఆకారపు అరుణ్ పటేల్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిధులతో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల్ల పరమేశ్వర్ రెడ్డి పూర్తి సహకారం ఆదేశాల మేరకువెంకట్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్, తూర్పు శ్రీనివాసపురం రామశంకర్ నగర్ కాలనీలలో నెలకొన్న ప్రజా సమస్యలపై ఉప్పల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్,వెంటనే స్పందించి, వాటిని విజయవంతంగా పరిష్కరించారు.నాడు కాలనీ వాసుల ఇబ్బందులు గత 4-5 నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఓపెన్ నాలా పనుల వల్ల స్థానిక ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా చిరు వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోయారు. ప్రధాన సీసీ రోడ్లు, డ్రైనేజీ తాగునీటి పైపులైన్ సమస్యలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు తాగునీటి పైపులైన్‌ను నాలా లోపల నుండి కాకుండా విడిగా (సెపరేట్) ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. యుద్ధ ప్రాతిపదికన స్పందన పనుల పూర్తి: ఈ సమస్యలను కాలనీ వాసులు అరుణ్ పటేల్ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. మన ప్రియతమ నాయకులు మందముల్ల పరమేశ్వర్ రెడ్డి అండదండలతో వెంటనే జిహెచ్ఎంసి జలమండలి అధికారులతో మాట్లాడి, పెండింగ్‌లో ఉన్న నాలా పనులను, పైపులైన్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించి ప్రజల కష్టాలను తీర్చారు. నాడు ప్రజలకు ఇచ్చిన మాటను నేడు చేతల్లో చూపిస్తూ ఆ పనిని విజయవంతంగా పూర్తి చేశారు! ఈ కార్యక్రమంలో అధికారులు, ముఖ్య నాయకులు ఈ పరిశీలన పనుల పర్యవేక్షణలో జిహెచ్ఎంసి ఏఈ శ్వేత, హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి మేనేజర్ రవీందర్,రంజిత్ రెడ్డి చోటా పరశురాం రాజేశ్వరరావు యాదగిరి రెడ్డి ఈశ్వర్ గౌడ్ రమేష్ యాదవ్ గిరీష్ కృష్ణ గౌడ్ నాయబ్ రాజేష్ రాజ్ జలంధర్ రెడ్డి శ్రీనివాస్ గౌడ్ లావణ్య కుమార్ లక్కన్ నరేందర్ రెడ్డి రోహిత్ సత్యనారాయణ ఆనంద్ దేశ్పాండే సుబ్బారావు రవి కాలనీవాసులు పాల్గొన్నారు రాజేష్, చిరు స్థానిక కాలనీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొయినాబాద్‌లో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు కీలక ముందడుగు





**పండ్లు, కూరగాయలు, పూల విక్రయాలకు 39 ఎకరాల భూమి కేటాయింపు**

**రైతుల ఆదాయం పెంపుతో పాటు వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు**

**రైతులకు లాభం -- నగర ప్రజలకు తాజా ఉత్పత్తు**

**మొయినాబాద్, జూన్ 16 (ప్రజా జ్యోతి)** మొయినాబాద్ మండలంలో భారీ వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. రైతులు తమ పండ్లు, కూరగాయలు, పూలను నేరుగా మార్కెట్‌లో విక్రయించేందుకు అనుకూలంగా సుమారు 39.07 ఎకరాల ప్రభుత్వ భూమిని మార్కెటింగ్ శాఖకు అప్పగించారు. ఈ మార్కెట్ ఏర్పాటుతో స్థానిక రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు అందడంతో పాటు నగర ప్రజలకు తాజా వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులోకి రానున్నాయి. స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య చేసిన విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు మొయినాబాద్ తహసీల్దార్ కె. గౌతమ్ కుమార్ ఆధ్వర్యంలో భూమి అప్పగింత ప్రక్రియ పూర్తి చేశారు. హిమాయత్‌నగర్ సర్వే నంబర్ 151, అజీజ్‌నగర్ సర్వే నంబర్ 176లో ఉన్న ప్రభుత్వ భూమిని మార్కెట్ నిర్మాణానికి కేటాయించారు. మండల గిర్దావర్ రాజేష్ పంచనామా నిర్వహించగా, మండల సర్వేయర్ జలజ భూమి హద్దులను గుర్తించారు. అనంతరం సంబంధిత పత్రాలను జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులకు అందజేశారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ గౌతమ్ కుమార్ మాట్లాడుతూ, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మార్కెట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. త్వరలో మరో 20.33 ఎకరాల భూమిని కూడా కేటాయించి, మార్కెటింగ్ శాఖ కోరిన మొత్తం 60 ఎకరాలను అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, వైస్ చైర్మన్ చంద్రశేఖర్, జీపీఓలు నర్సింహా, హరిత, రవి తదితరులు పాల్గొన్నారు. మార్కెట్ ఏర్పాటుతో పశ్చిమ రంగారెడ్డి జిల్లా రైతులకు కొత్త అవకాశాలు లభించనున్నాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి కృషి ఇప్పటికే

# సొంత భవనం నిర్మాణం చేసి ఇచ్చాం






**ఉప్పల్, జూన్16,(ప్రజాజ్యోతి)** సీనియర్ సిటిజన్స్ సంక్షేమం, అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నామని ఉప్పల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధి కోసం పని చేస్తున్నారని గుర్తు చేశారు.ల ఉప్పల్ గోల్డెన్ బర్డ్స్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి హాజరై మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్ కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రత్యేక చట్టాన్ని రూపొందించి అమలు చేస్తున్నారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఉప్పల్ లో ఉన్న సీనియర్ సిటిజన్స్ కోసం స్థలాన్ని కేటాయించడంతో పాటు భవనాన్ని సైతం నిర్మాణం చేసి ఇచ్చామన్నారు. రానున్న కాలంలో సీనియర్ సిటిజన్స్ కోసం పని చేసేందుకు, అన్ని వేళల్లో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ గోల్డెన్ బర్డ్స్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు మేకల రామ్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి వెంకటయ్య గౌడ్ ఉపాధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి మనోహర్,సంయుక్త కార్యదర్శిలు నరసింహారెడ్డి లింగారెడ్డి,ఆర్గనైజింగ్ సెక్యూరిటీ లు విజయ రావు,సల్ల మల్లారెడ్డి, సలహాదారు, మేకల వెంక రెడ్డి, షమీర్పేట్ యాది రెడ్డి షమీర్పేట్ ధర్మ రెడ్డి, గోనె ప్రభాకర్ రెడ్డి , గోనె అర్జున్ రెడ్డి, శ్రీనివాస్, జ్ఞానేశ్వర్ రావు, మెంబర్స్, మందుముల అంజి రెడ్డి,లక్ష్మీనరసయ్య, పాండురంగమ్మ,వీరేశం, కుమార స్వామి,రామయ్య గౌడ్, ఐలయ్య,స్నేహ,కృష్ణారెడ్డి , బుచ్చిరెడ్డి గారు, బిక్షపతి, రఘురామయ్య ,నారాయణ పాపి రెడ్డి,సత్యనారాయణ,రామ్ రెడ్డి,వెంకటేశ్వర,వెంకటమ్మ సుశీల,సంధ్య,రేఖ,శ్రీవాణి, ఇందిరా, స్వరూపారాణి, అనసూయ, సల్ల ప్రభాకర్ రెడ్డి,



తుమ్మల దేవి రెడ్డి, కర్ణాకర్ రెడ్డి సుంకు శేఖర్ రెడ్డి, మంద మురళి కృష్ణారెడ్డి,బజార్ నవీన్, ప్రశాంత్ రెడ్డి, రంగుల శేఖర్, పాల్గొన్నారు

# నేడు యెన్కెపల్లి, కనకమామిడి గ్రామాల ప్రజలకు ముందస్తు సూచనలు

**వర్షాకాల నిర్వహణ పనుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేత**

**మొయినాబాద్ : జూన్ 16 (ప్రజా జ్యోతి)** వర్షాకాలంలో విద్యుత్ అంతరాయాలను నివారించి వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు విద్యుత్ శాఖ ప్రత్యేక నిర్వహణ పనులు చేపడుతోంది. చెట్ల కొమ్మల తొలగింపు, ఫీడర్ మరమ్మతులు, లైన్ల తనిఖీలు వంటి కార్యక్రమాల నేపథ్యంలో జూన్ 17 బుధవారం విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు మొయినాబాద్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఆపరేషన్స్) బి. హమూ నాయక్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. మొయినాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ కపిల్ అగ్రో ఫీడర్ కింద ఉన్న కపిల్ అగ్రో ప్రాంతం, సంబంధిత ఫామ్ హౌస్‌లు, అలాగే 11 కేవీ యెన్కెపల్లి ఫీడర్ గ్రామం పరిధిలో మరియు పరిసర ప్రాంతాలు ఈ అంతరాయానికి గురికానున్నాయి. అదే విధంగా కనకమామిడి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ కనకమామిడి ఫీడర్ కింద ఉన్న కనకమామిడి గ్రామం, దాని పరిధిలోని ఫామ్ హౌస్‌లలో కూడా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. వర్షాకాలంలో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగలకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. వినియోగదారులు సహకరించి అసౌకర్యాన్ని అర్థం చేసుకోవాలని కోరారు. అత్యవసర సమాచారం కోసం-రాజు సెల్ నంబర్ 8712469559ను సంప్రదించవచ్చని వెల్లడించారు.

# యెన్కెపల్లిలో అనుమానాస్పద వ్యక్తి కలకలం

**చెత్త బండితో సంచరిస్తూ గ్రామస్తులకు కనిపించిన వ్యక్తి**

**అప్రమత్తంగా స్పందించి పోలీసులకు అప్పగించిన కౌన్సిలర్ ప్రభాకర్ యాదవ్**




**మొయినాబాద్, జూన్ 16 (ప్రజా జ్యోతి):** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని యెన్కెపల్లి గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని గ్రామస్తులు గుర్తించి పోలీసులకు అప్పగించిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. గ్రామ వీధుల్లో చెత్త బండితో సంచరిస్తూ కనిపించిన వ్యక్తి తీరుపై అనుమానం వ్యక్తం చేసిన స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు.

గ్రామస్తుల సమాచారంతో యెన్కెపల్లి 9వ వార్డు కౌన్సిలర్ ప్రభాకర్ యాదవ్ సంఘటన స్థలానికి చేరుకుని ఆ వ్యక్తిని ప్రశ్నించారు. తన పేరు జాఫర్ అని చెప్పిన ఆ వ్యక్తి పూర్తి వివరాలు స్పష్టంగా వెల్లడించకపోవడంతో అనుమానాలు మరింత పెరిగాయి. స్థానికుల కథనం ప్రకారం అతను విదేశీ దేశానికి చెందిన వ్యక్తిగా భావిస్తున్నట్లు తెలిపారు. విషయాన్ని వెంటనే పోలీసుల దృష్టికి తీసుకెళ్లిన కౌన్సిలర్ ప్రభాకర్ యాదవ్, సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందించి ఆ వ్యక్తిని వారి ఆధీనంలోకి అప్పగించారు. అనంతరం పోలీసులు అతని గుర్తింపు, నివాస స్థలం, గ్రామంలో తిరుగడానికి గల కారణాలు తదితర అంశాలపై విచారణ చేపట్టారు. గ్రామంలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానిక నాయకులు సూచించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులకు సహకరించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రస్తుతం పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తుండగా, విచారణ అనంతరం వాస్తవాలు వెల్లడికానున్నాయి.

# హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనుల పరిశీల న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్




**ఉప్పల్, జూన్ 16,(ప్రజా జ్యోతి):** హెచ్‌ఎంటి నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులలో భాగంగా ఇప్పటికే చెరువులో నీటిని పూర్తిస్థాయిలో తొలగింపు పనులు పూర్తి చేయడం జరిగింది. ప్రస్తుతం పూడిక తొలగింపు పనులు సుమారు ఐదు హిటాచీ యంత్రాలతో వేగంగా కొనసాగుతున్నాయి. హెచ్‌ఎంటి నగర్ వైపు నుండి ఇందిరానగర్ కట్ట వరకు వెళ్లేందుకు ప్రస్తుతం మెయిన్ రోడ్డు వినియోగించాల్సి వస్తుండటంతో, పనులు వేగవంతంగా కొనసాగించేందుకు ఇందిరానగర్ నుండి హెచ్‌ఎంటి నగర్ వరకు ఎస్‌టీపీ పక్కనుగా యంత్రాలు వెళ్లేందుకు తాత్కాలిక రహదారి ఏర్పాటు చేస్తున్నారు అలాగే, చెరువులోకి నీరు చేరకుండా ఉండేందుకు పటేల్‌కుంట నుండి వస్తున్న నీటిని ఇప్పటికే ట్రంక్ లైన్‌లోకి మళ్లించడం జరిగింది. అయితే ప్రస్తుతం నిర్మిస్తున్న తాత్కాలిక రహదారి కారణంగా భారీ వర్షాల సమయంలో ట్రంక్ లైన్ పై నుంచి నీరు చెరువులోకి వెళ్లకుండా కాలనీలోకి వచ్చే అవకాశం ఉందని గుర్తించిన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, ముందస్తు జాగ్రత్త చర్యగా రహదారి కింద పైపులు ఏర్పాటు చేసి నీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా చూడాలని కాంట్రాక్టర్‌కు సూచించారు ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు అషు తదితరులు పాల్గొన్నారు.

# చదువు పేరుతో 'ఫీజుల దోపిడీ'..!

**చేవెళ్ల, జూన్ 16(ప్రజా జ్యోతి):** చదువు ప్రతి కుటుంబానికి భవిష్యత్తుపై పెట్టుబడి.. కానీ అదే చదువు ఇప్పుడు కొన్ని కుటుంబాలకు ఆర్థిక భారంగా మారుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. చేవెళ్లలోని పలు ప్రైవేట్ పాఠశాలలు, విద్యాసంస్థల్లో అడ్మిషన్ల పేరుతో భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**అడ్మిషన్ల సీజన్.. ఫీజుల మోత**

అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో పలు ప్రైవేట్ విద్యాసంస్థలు భారీ ఫీజులతో తల్లిదండ్రులపై భారం మోపుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. నర్సరీ స్థాయి నుంచే రూ.20 వేల నుంచి ఫీజులు ప్రారంభమవుతున్నాయని, తరగతులు పెరిగే కొద్దీ ఫీజులు పెరుగుతూ పదో తరగతి వరకు లక్షల రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు చెబుతున్నారు.

**పిల్లల చదువు కోసం అప్పుల బాట**

పిల్లలకు మెరుగైన విద్య అందించాలనే ఆశతో మధ్యతరగతి, పేద కుటుంబాలు అప్పులు చేసి అయినా ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తున్నాయని చెబుతున్నారు. పెరుగుతున్న ఫీజులు, అదనపు ఖర్చులు కుటుంబ ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఫీజులతో పాటు 'అదనపు' భారం**

ట్యూషన్ ఫీజులతో పాటు పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, ఇతర సామగ్రిని పాఠశాల సూచించిన చోటే కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బయట తక్కువ ధరకు లభించే వస్తువులు ఉన్నప్పటికీ పాఠశాలల నిబంధనల కారణంగా అదనపు ఖర్చు తప్పడం లేదని తల్లిదండ్రులు అంటున్నారు.

**నిబంధనలు ఉన్నా.. అమలు ఏది?**

కొన్ని పాఠశాలల్లో భవన నిర్మాణ పనులు కొనసాగుతుండగానే అడ్మిషన్లు చేపడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యాశాఖ అధికారులు తనిఖీలు, పర్యవేక్షణను కఠినతరం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ప్రచారంలో ప్రైవేట్ దూకుడు.. ప్రభుత్వ బడులకు సవాల్**

భారీ హోర్డింగులు, ప్రకటనలు, ప్రచార కార్యక్రమాలతో ప్రైవేట్ విద్యాసంస్థలు తల్లిదండ్రులను ఆకర్షిస్తుండగా.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు మరింత చర్యలు అవసరమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఫీజుల దందాకు అడ్డుకట్ట పడేనా?

చేవెళ్లలో ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణపై అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. విద్య వ్యాపారంగా మారకుండా, విద్యార్థుల కుటుంబాలపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# ఘనంగా హెచ్‌ఎస్ బీసీ రగ్బీ ప్రీమియర్ లీగ్-2 ప్రారంభం

## -హాజరైన రాష్ట్ర క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, జూన్ 16 (ప్రజా జ్యోతి) :** ఈనెల 16 నుంచి 28 వరకు జరగనున్న హెచ్‌ఎస్ బీసీ రగ్బీ ప్రీమియర్ లీగ్(ఆర్పీఎల్) పవర్డ్ బై ఏవిడ్ సీజన్-2 గచ్చిబౌలి స్టేడియంలో మంగళవారం ఘనంగా ప్రారంభమైందని నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రగ్బీ ఇండియా భాగస్వామ్యంతో జీఎంఆర్ స్పోర్ట్స్ నిర్వహిస్తున్న ఈ లీగ్‌లో ఆరు పురుషుల ఫ్రాంచైజీలతో పాటు తొలిసారిగా నాలుగు మహిళల ఫ్రాంచైజీలు పాల్గొంటున్నట్లు చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రి వాకిటి శ్రీహరి, జీఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ కిరణ్ కుమార్ గ్రాంధి, రగ్బీ ఇండియా అధ్యక్షుడు రాహుల్ బోస్, నటి-గాయని శృతి హాసన్ పాల్గొని మహిళల ట్రోఫీని ఆవిష్కరించినట్లు చెప్పారు. మంత్రి వాకిటి శ్రీహరి తెలంగాణ క్రీడలకు ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని పేర్కొనగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధిని వివరించారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఉపాధ్యక్షురాలు, ఎండీ ఎ.సోని బాల దేవి లీగ్ నిర్వహణకు పూర్తి సహకారం అందించామని తెలిపారు. రగ్బీ ఇండియా అధ్యక్షుడు రాహుల్ బోస్ ఈ సీజన్‌లో 20 దేశాల ఆటగాళ్లు పాల్గొంటున్నారని, మహిళల పోటీ ప్రవేశపెట్టడం




చారిత్రాత్మకమని చెప్పారు. జీఎంఆర్ స్పోర్ట్స్ సిఎంఓ సుజాయ్ గంగూలీ భారతదేశంలో ప్రపంచ స్థాయి రగ్బీ వ్యవస్థ నిర్మాణానికి సీజన్-2 కీలక ముందడుగని పేర్కొన్నారు.

# మిమ్స్ కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన

**ఉత్సాహంగా పాల్గొని రక్తాన్ని అందించిన మిమ్స్ విద్యార్థులు, సిబ్బంది**







**మేడ్చల్, జూన్ 16 (ప్రజాజ్యోతి):** ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్లంపేట మున్సిపాలిటీ ఘనపూర్ లోని మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వారు నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. మీమ్స్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు, పని చేస్తున్న సిబ్బందికి రక్తదానంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటూ సంస్థ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇందుకోసం హాస్పిటల్ లో మూడు రోజులుగా వీరందరికీ ప్రత్యేకంగా తరగతులు నిర్వహించడమే కాకుండా వారిని రక్తదానానికి ప్రోత్సహించారు. ప్రేరణ పొందిన విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకొని నేడు నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో వైద్య విద్య, నర్సింగ్ పారామెడికల్ కోర్సులలో చదువుకొంటున్న విద్యార్థి, విద్యార్థిణులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు. అంతకు ముందు రిజిస్ట్రేషన్ చేసుకొన్న వారికి ఉచితంగా బ్లడ్ గ్రూప్ , హిమోగ్లోబిన్ , హెచ్ఐవి , హెపటైటిస్ -బి ,హెపటైటిస్ - సి , సిఫిల్, మలేరియా మొదలైన పరీక్షలు చేశారు. అనంతరం వీరి ద్వారా హాస్పిటల్ లో చికిత్సకు వచ్చే రోగులకు ఉపయోగపడేలా వివిధ బ్లడ్ గ్రూపుల రక్తాన్ని బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సేకరించి భద్రపరిచారు.ఈ సందర్భంగా మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లోని బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జ్ డా. మాన్విత సింధు మాట్లాడుతూ రక్తదానం పై పలు అపోహలు చలామణిలో ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా దానం చేసిన వారు నీరస పడిపోతారని, వారి శరీరంలో రక్తం తగ్గిపోతుందని, రోగ నిరోధక శక్తి కోల్పోయే ప్రమాదం ఉందనే అపోహలు పూర్తిగా అవాస్తమని వివరించారు. రక్తదానం శరీరాన్ని మరింత ఆరోగ్యవంతంగా చేస్తుందని అలానే మరొక విలువైన ప్రాణాన్ని కాపాడడానికి ఎంతగానో ఉపయోగపడుతుందనే విషయాన్ని అందరూ గ్రహించాలని సూచించారు.

అనంతరం కార్యక్రమంలో రక్తదానం చేసిన వారికి మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆప్ మెడికల్ సైన్సెస్ తరపున సర్టిపికేట్ లు అందజేశారు. మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆప్ మెడికల్ సైన్సెస్ లోని పాథాలజీ విభాగపు అధిపతి డా. రాజశేఖర రెడ్డి నేతృత్వంలో బ్లడ్ బ్యాంకు ఇన్చార్జి డా. మాన్విత సింధు ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంకు సిబ్బంది శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎంఎస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కే శివరామకృష్ణ వారితో పాటూ , ఎంఐఎంఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవేందర్ సింగ్ నేగి డా. గీత, ఇతర వైద్యులు, వైద్య వైద్యేతర సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాకాల సన్నద్ధతపై అల్వాల్‌లో అధికారుల సంయుక్త పర్యటన

**అల్వాల్, జూన్ 16 (ప్రజా జ్యోతి)**




'మీ సురక్షణ -- మీ రక్షణకై' కార్యక్రమంలో భాగంగా రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల భద్రత, సౌకర్యాల కోసం పోలీసు, జీహెచ్‌ఎంసీ, హైడ్రా మరియు ఇతర శాఖల అధికారులు సోమవారం అల్వాల్‌లోని లోతట్టు ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. వర్షాల కారణంగా నీరు నిలిచిపోయే ప్రాంతాలు, నాలాలు, డ్రైనేజీ వ్యవస్థలు, రహదారుల పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో నీటి ప్రవాహానికి ఆటంకంగా ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సుమతి, హైడ్రా కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. హైడ్రా, జీహెచ్‌ఎంసీ, లా అండ్ ఆర్డర్, టౌన్ ప్లానింగ్, వాటర్ వర్క్స్ విభాగాల అధికారులు సమన్వయంతో ప్రాంతాలను పరిశీలించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన ప్రజా అవగాహన కార్యక్రమంలో వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన శాఖలు, వరద ముప్పు సమయంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల రక్షణ, భద్రత కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు. వర్షాకాలంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అధికారులకు సహకరించాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు.

# ఉప్పల్ హిల్స్ కాలనీలో మీ సురక్ష పై అవగాహన సదస్సు

**మాట్లాడుతున్న ఏసిపి వెంకట్ రెడ్డి, ఇన్స్పెక్టర్ రామలింగారెడ్డి**

**ఉప్పల్, జూన్16,(ప్రజా జ్యోతి)**




ఉప్పల్ :మల్కాజిరి పోలీస్ కమీషనర్ సుమతి ఆదేశాల మేరకు ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మీ సురక్షపై పోలీసులు విస్తృతంగా అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం ఉప్పల్ హిల్స్ కాలనీలో ఏసీపీ వెంకట్ రెడ్డి ఇన్స్పెక్టర్ రామలింగరెడ్డి సెక్టార్ ఎస్ఐ మాధవరెడ్డి ఆధ్వర్యంలో మీ సురక్ష ఎన్యుమరేషన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రజలకు మీ సురక్ష ఎన్యుమరేషన్ యొక్క ఉపయోగాలు వాటి ప్రాముఖ్యతను స్పష్టంగా వివరించారు. నగరంలో ఇటీవల అంతర్రాష్ట్ర నేపాలి ముఠాల కదలికలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ వెంకట్ రెడ్డి సూచించారు. ఇళ్లలో పని చేసే కార్మికులు, డ్రైవర్లు, వాచ్మన్లు, అద్దెకు నివసించే వ్యక్తులు, అలాగే ఒంటరిగా నివసించే వృద్ధుల పూర్తి వివరాలను ఇంటి యాజమా నులు కాలనీ ప్రతినిధులు స్థానిక పోలీస్ స్టేషన్లో నమోదు చేయించి పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమం ఉప్పల్ కాలనీ సభ్యులు, ఏఎస్ఐ షేక్ మీరా, కానిస్టేబుల్స్ మోహన్లాల్ వందన తదితరులు పాల్గొన్నారు

# గండిపేట్ చెరువులో యువకుడి మృతదేహం లభ్యం

**గల్లంతైన నేపాల్‌కు చెందిన కార్మికుడి కోసం విస్తృత గాలింపు**



**మొయినాబాద్, జూన్ 16 (ప్రజా జ్యోతి):** గండిపేట్ చెరువులో గల్లంతైన యువకుడి మృతదేహం మంగళవారం ఉదయం లభ్యమవడంతో విషాదం నెలకొంది. నేపాల్ దేశానికి చెందిన ఓం బహదూర్ (28), పిస్తా హౌస్ హోటల్‌లో కార్మికుడిగా పనిచేస్తూ హిమాయత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఓం బహదూర్ గండిపేట్ చెరువులో గల్లంతైనట్లు అందిన ఫిర్యాదు మేరకు మొయినాబాద్ పోలీసులు వెంటనే స్పందించి గాలింపు చర్యలు ప్రారంభించారు. చెవెళ్ల ఎస్ డి ఆర్ ఎస్ బృందం, 3వ బెటాలియన్ ఎస్ డి ఆర్ ఎస్, సిబ్బంది సహకారంతో చెరువులో విస్తృతంగా శోధన చేపట్టారు. పలువురు సిబ్బంది గంటల తరబడి గాలింపు చర్యలు నిర్వహించినప్పటికీ మొదట ఆచూకీ లభించలేదు. అయితే మంగళవారం ఉదయం సుమారు 6 గంటల సమయంలో గండిపేట్ చెరువులో ఓం బహదూర్ మృతదేహం తేలియాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతికి గల కారణాలు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నారు. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి.

# పర్యావరణ రక్షణ కోసం మొక్కలు నాటాలి

**సిడి తాండ సర్పంచ్ గబ్రు చౌహాన్**

**సర్పంచ్ తో కలిసి సిడి తాండ,ఆర్కెఆర్ లో మొక్కలు నాటిన పాలకవర్గం**



**కొత్తూర్ జూన్ 16 (ప్రజా జ్యోతి)** పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించడం కోసం అని సిడి తాండ సర్పంచ్ గబ్రు చౌహాన్ అన్నారు. మంగళవారం నందిగామ మండలంలోని సీడీ తాండ,ఆర్కెఆర్ లో పాలకవర్గంతో కలిసి సర్పంచ్ గబ్రు చౌహాన్ మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మానవళి మనుగడకు చెట్లు మెట్లలాంటివని,వృక్షాలను కాపాడితే అవి మనల్ని కాపాడుతాయన్నారు.నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత అందరిపై ఉందన్నారు.మొక్కల పెంపకంతో వాతావరణంలో కాలుష్యం తగ్గి అందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ గబ్రు చౌహాన్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవీందర్ నాయక్,సెక్రటరీ రవీందర్ నాయక్, నందిగామ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు, వార్డ్ సభ్యుడు శ్రీను నాయక్, వార్డు సభ్యులు బుజ్జి శంకర్ నాయక్,నగేష్ నాయక్,శాంతి శ్రీను నాయక్,రాజేష్ నాయక్, మాధవి లక్ష్మణ్,పత్తి శ్రీను నాయక్,గ్రామపంచాయతీ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# బావిలో పడి బాలుడి మృతి

**. తాడుతో దిగే ప్రయత్నంలో జారిపడి విషాదం**

**. 24 గంటల అనంతరం వెలికితీత.. కేసు నమోదు చేసిన బోయిన్‌పల్లి పోలీసులు**



**బోయిన్‌పల్లి, జూన్ 16.(ప్రజా జ్యోతి):** బావిలోకి దిగేందుకు చేసిన ప్రయత్నం ఓ ఎనిమిదేళ్ల బాలుడి ప్రాణాలను బలిగొంది. ఆల్వాల్ యాదమ్మనగర్ గ్రీన్‌ఫీల్డ్ ప్రాంతానికి చెందిన నితీష్ కుమార్ (8) ప్రమాదవశాత్తూ బావిలో పడి మృతి చెందిన ఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో నితీష్ తన స్నేహితులతో కలిసి అర్కా డెయిరీ ఫామ్ సమీపంలోని పాత బావి వద్దకు వెళ్లాడు.ఈ క్రమంలో తాడును ఆధారంగా చేసుకుని బావిలోకి దిగేందుకు ప్రయత్నించగా, తాడు జారిపోవడంతో బాలుడు బావిలో పడిపోయాడు.సమాచారం అందుకున్న ప్రభుత్వ అధికారులు, అత్యవసర సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. మంగళవారం సాయంత్రం 4.50 గంటల సమయంలో బాలుడిని బావి నుంచి బయటకు తీశారు. ప్రాథమిక విచారణలో ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు.ఈ ఘటనపై బోయిన్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఖానాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా అక్షర బ్యాసం



**తలకొండపల్లి,జూన్16 (ప్రజాజ్యోతి)** తలకొండపల్లి మండల కేంద్రంలోని ఖానాపూర్ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం అక్షరాభ్యాస కార్యక్రమం గ్రామ సర్పంచ్ అనిత శ్రీనివాస్ అధ్వర్యంలో ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ...అంగన్వాడీ కేంద్రాలే పిల్లలకు అక్షరాలు నేర్పే తొలి బడి అని,ఇక్కడే వారి బంగారు భవిష్యత్తుకు బాటలు పడతాయని అన్నారు.ప్రభుత్వం అందించే బలవర్ధకమైన ఆహారం పిల్లల శారీరక ఎదుగుదలకు ఎంతో అవసరమని వారు గుర్తు చేశారు.అనంతరం ఖానాపూర్ గ్రామంలో బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలని కోరుతూ ఖానాపూర్ గ్రామ సర్పంచ్ అనిత శ్రీనివాస్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతంకై ప్రతి ఒక్కరూ భాగ్యస్వామ్యం వహించాలని వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఖానాపూర్ గ్రామ సర్పంచ్ అనిత శ్రీనివాస్...

# దేశం కోసం యువతరం కదలాలి

## సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ .

మోదీ ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం .
మనపై ఆంక్షలు విధిస్తున్న ట్రంప్ పేరును
హైదరాబాద్ లోని ఒక రోడ్డుకు పెట్టడం సిగ్గుచేటు :
సీపీఎం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బీవీ రాఘవులు.
దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరిగింది :
రాజ్యసభ సభ్యుడు రహీం.
సీపీఎం రాష్ట్ర యువ కమ్యూనిస్టుల సమ్మేళనం.




**రంగారెడ్డి జూన్ 16 (ప్రజా జ్యోతి)** యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని, పెట్టుబడిదారుల నుంచి దేశాన్ని విముక్తి చేయడానికి యువతరం కదిలాలని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపునిచ్చారు.. మోదీ ప్రభుత్వం దేశ భవిష్యత్తును అమెరికాకు తాకట్టు పెట్టారని, ఆర్థిక వ్యవస్థ పెట్టుబడిదారుల చేతుల్లో ఉందని రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. కొత్తపేటలోని బీజేఆర్ భవన్ మంగళవారం యువ కమ్యూనిస్టుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జెండాను రాష్ట్ర, జాతీయ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం సమ్మేళనంలో బీవీ రాఘవులు మాట్లాడుతూ అమెరికా చేతిలో ప్రధాని మోదీ కీలుబొమ్మగా మారాడని, మన నావికులను చంపినా అడిగే ధైర్యం మోదీకి లేదన్నారు. అమెరికా ఇరాన్ పై చేస్తున్న యుద్ధానికి మోదీ మద్దతు ఇస్తారని ఆరోపించారు. దేశానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రధాన శతృవులని మండిపడ్డారు. మన దేశంపై ఆర్థిక ఆంక్షలు విధిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేరును హైదరాబాద్ నగరంలో ఒక రోడ్డుకు పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుచేటు అని విమర్శించారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు మోదీ ఎదుట మోకరిల్లుతున్నాయని ధ్వజమెత్తారు. దేశాభివృద్ధి కోసం యువతరం కదిలాలని బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యుడు రహీం మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వంలో దేశ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం అయిందన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం భారీగా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశ ఉత్పత్తులపై భారీ ఆంక్షలు విధిస్తున్నా, మన దేశ నౌకలపై దాడులు చేస్తున్నా అమెరికాను నిలదీసే ధైర్యం ప్రధాని మోదీకి లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు యువతరం ముందుకు రావాలని ఆయన కోరారు. సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ సీపీఎం పార్టీ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీస్తూ పేదలకు అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనలో అన్ని విధాలుగా విఫలమైందని, ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో రైతు బంధు ఇవ్వలేదని, ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సీపీఎం పార్టీ బలోపేతానికి యువజన నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటి యువతరం రాజకీయాల్లోకి వచ్చి సమసమాజం స్థాపనకు ఉద్యమించాలని జాన్ వెస్లీ కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, నాయకులు వీరయ్య, వెంకన్న, తొట రమేశ్, పగడాల యాదయ్య, నర్సింహ, గోపి నాయక్, కట్ట శ్రీనివాస్, ఆలేటి ఎల్లయ్య, కీసరి నర్సిరెడ్డి తోపాటు డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

## వాసవి నగర్‌లో ప్రజా సమస్యలపై కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పర్యటన



**అల్వాల్ జూన్ 13 (ప్రజా జ్యోతి)** అల్వాల్ ఆర్‌సీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి వాసవి నగర్ కాలనీలో పర్యటించి స్థానిక ప్రజలతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో నెలకొన్న పలు మౌలిక వసతుల సమస్యలపై నివాసితులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సీసీ రోడ్ల నిర్మాణం, ప్రస్తుతం ఉన్న మురుగునీటి కాలువ (సీవరేజ్) వ్యవస్థ పునర్నిర్మాణం, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు, అలాగే ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను కత్తిరించాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్‌కు వివరించారు. చెట్ల కొమ్మలు విస్తరించి ప్రజలకు ఇబ్బందులు కలిగించడంతో పాటు భద్రతాపరమైన సమస్యలు కూడా తలెత్తుతున్నాయని తెలిపారు. ప్రజలు వెల్లడించిన సమస్యలను శాంతి శ్రీనివాస్ రెడ్డి ఓపికగా విని, వాటిని సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన పౌర సౌకర్యాలు, మౌలిక వసతులు అందించడం తమ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. కాలనీల అభివృద్ధి కోసం ప్రజల సహకారంతో ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగారెడ్డి, సాజిద్, యాదగిరి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నీరు నిలిచె ప్రదేశాలలో వర్షాకాల అవగాహన కార్యక్రమం

1) చిలుకనగర్ టి-జంక్షన్
2) ఆదిత్య యు-టర్న్
3) స్నేహపురి కాలనీ.



**ఉప్పల్, జూన్ 16,(ప్రజా జ్యోతి)** ఉప్పల్ డివిజన్, డీసీపీ ట్రాఫిక్ ×× వి. శ్రీనివాసులు ఏసీపీ ట్రాఫిక్ ఎస్. సంపత్, చిలుకనగర్ టి-జంక్షన్ ఆదిత్య యు-టర్న్‌ను సందర్శించి, వర్షాకాలంలో పాటించవలసిన భద్రతా జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి. నాగరాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్ ఎస్ఐలు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

. ప్రజలకు అవగాహన కల్పించిన ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు




బోయిన్ పల్లి, జూన్ 16.(ప్రజా జ్యోతి): వర్షాకాలంలో పాటించాల్సిన భద్రతా జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తిరుమలగిరి పోలీసులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్కానా పరిధిలోని క్రోమా సమీపంలోని నీటి నిల్వ ప్రాంతంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రాఫిక్-1 డీసీపీ కె. రాహుల్ రెడ్డి, ఐపీఎస్, తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ, శంకర్ రాజు, తిరుమలగిరి లా అండ్ ఆర్డర్ ఏసీపీ, కర్కానా ఎస్‌హెచ్‌వో పాల్గొన్నారు.వర్షాల కారణంగా నీరు నిలిచే ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనవసరంగా నీటిలోకి వెళ్లవద్దని, వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ప్రజల భద్రతే లక్ష్యంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.

## రైతులకు ప్రజలకు అసౌకర్యం కలుగకుండా నిత్యం శుభ్రంగా ఉంచాలి: చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి.



**రంగారెడ్డి జూన్ 16 (ప్రజా జ్యోతి)** ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్ యార్డును ప్రతిరోజు శుభ్రంగా ఉంచాలని , మార్కెట్ కు వచ్చే రైతులకు ,ప్రజలకు, వ్యాపారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అధికారులకు సూచించారు. మార్కెట్ యార్డులో చెత్తాచెదారం పేరుకుపోయిందని రైతులు, వ్యాపారులు ఫిర్యాదు చేయడంతో తక్షణమే స్పందించి పూర్తిస్థాయిలో చెత్తాచెదారాన్ని శుభ్రపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో మరింత అప్రమత్తంగా ఉండాలని చెత్తను ఎప్పటికప్పుడు తీసివేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టడంతో పాటు, సమస్యలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. రైతులు, వ్యాపారులు ఏ చిన్న సమస్య ఉన్నా నిరభ్యంతరంగా మా దృష్టికి తీసుకురావాలి అని కోరారు.

## పీర్లను నిలబెట్టడంలో ఆదర్శంగా నిలుస్తున్న దాత్రిక వంశీయులు



**మేడ్చల్, జూన్ 16 (ప్రజాజ్యోతి)'** దాత్రిక విట్టల్ 1950 సంవత్సరంలో నిలబెట్టిన పేర్లను వారి వారసులు నేటికీ నిలబెడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మేడ్చల్ పట్టణంలో దాత్రికి వంశీయులు పీర్లను నిలబెట్టడంలో ఆదర్శంగా నిలుస్తున్నారు 1950 సంవత్సరం లో దాత్రిక విట్టల్ పీర్లను నిలబెట్టుగా వారి వారసులు నేటి వరకు పీర్లను నిలబెడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. దాత్రికే విట్టలు వారసులు నాటి నుంచి నేటి వరకు పీర్లను ఎలాంటి అవాంతరాలు లేకుండా నిలబెడుతున్నారు ఈ కార్యక్రమంలో దాత్రిక విజయ్ కుమార్ దాత్రిక గిరిబాబు, దాత్రిక కీర్తి, ధాత్రిక సువర్ణ, ప్రమోద్, కవిత కుటుంబ సభ్యులు పాల్గొని పేర్లను నిలబెట్టారు.

## 1013 సర్వే నెంబర్‌లో నక్షబాట గుట్ట రట్టు

నక్షబాటపై అడ్డంకులు.. రైతుల పొలాలకు దారి మూసివేత!
పెద్ద బండరాళ్లు , చెట్లతో మార్గ దిగ్బంధం
వెంటనే సర్వే చేసి దారి పునరుద్ధరించాలని రైతుల డిమాండ్



**షాబాద్, జూన్ 16 (ప్రజాజ్యోతి)** షాబాద్ మండల పరిధిలోని మరియాపూర్ గ్రామ శివారులో నక్షబాట (ప్రజా రహదారి) వివాదం రైతుల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది. కేశవగూడ గ్రామానికి చెందిన పామెన కిష్టయ్య నక్షబాటకు అడ్డంగా బండరాళ్లు , చెట్లు వేసి రాకపోకలను అడ్డుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో దశాబ్దాలుగా వినియోగిస్తున్న ప్రజా మార్గం మూసుకుపోయి వ్యవసాయ పనులకు ఆటంకం కలిగిస్తుందనీ రైతులు వాపోతున్నారు. గ్రామ రైతులు పొలాలకు వెళ్లే , ఈ నక్షబాట ద్వారానే వ్యవసాయ భూములకు రాకపోకలు సాగుతున్నాయి. ట్రాక్టర్లు, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్రాలు, పంట ఉత్పత్తుల రవాణా అన్నీ ఇదే మార్గం ద్వారా జరుగుతున్నాయి. అయితే ఇటీవల మార్గానికి అడ్డంగా భారీ రాళ్లు, చెట్లు వేయడంతో వ్యవసాయ వాహనాల రాకపోకలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానాకాల సాగు పనులు ప్రారంభమైన ఈ కీలక సమయంలో రైతులు పొలాలకు చేరుకోవడానికే ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొందరు రైతులు అదనపు దూరం ప్రయాణించాల్సి వస్తుండగా, మరికొందరికి పొలాలకు వెళ్లే మార్గమే లేకుండా పోయిందని పేర్కొన్నారు. ప్రజా రహదారిపై అడ్డంకులు తొలగించకపోతే సాగు పనులు తీవ్రంగా ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీ శాఖ అధికారులు వెంటనే భూ రికార్డులు, నక్ష బాట మ్యాపులను పరిశీలించి సర్వే నిర్వహించాలని, ప్రజా రహదారి ఉంటే వెంటనే అడ్డంకులను తొలగించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజా రహదారుల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత అని, రైతుల జీవనాధారమైన వ్యవసాయానికి ఆటంకం కలిగించే అంశాలను అధికారులు అత్యంత ప్రాధాన్యంతో తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



## అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం.



రంగారెడ్డి జూన్ 16 (ప్రజా జ్యోతి) ఎన్టీఆర్ నగర్ ఫేజ్ 3 లో మంగళవారం అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూపర్ వైజర్ నారాయణమ్మ విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం తో పాటు శిశువులకు పౌష్టికాహారం, ఆరోగ్య సలహాలు సూచనలు కూడా ఉంటాయని ఆమె వివరించారు. అదే విధంగా కిషోర్ బాలికలకు కూడా ఆరోగ్యపరమైన అంశాలు తెలుసుకోవడానికి అంగన్వాడీ టీచర్లు కృషి చేస్తున్నారు అని ఆమె అన్నారు. బాలింతలు, గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య సలహాలతో పాటు పౌష్టికాహారం కూడా ఉంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పుష్పలత, గంగా, సునీత, ఆశా వర్కర్లు హేమలత వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తింపు కార్డు అందుకున్న డబ్బు కళాకారులు మహంకాళి శ్రవణ్ కుమార్



**రంగారెడ్డి జూన్ 16 ( ప్రజా జ్యోతి)** సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అందజేసిన మొట్ట మొదటి ప్రభుత్వ గుర్తింపు కార్డు ను మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా డప్పు కళాకారుడు మహంకాళి శ్రవణ్ కుమార్ అందుకున్నారు. గత 20 సంవత్సరాలు గా డప్పు కళాకారుడు గా ప్రభుత్వ,ప్రైవేట్ కార్యక్రమాలలో ఎన్నో ప్రదర్శనలు చేసినందుకు గాను నన్ను గుర్తించి మొట్ట మొదటగా నా కార్డ్ తోనే ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని శ్రవణ్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహా రెడ్డి,సాంస్కృతిక సారధి ఛైర్మెన్ వెన్నెల, శ్రీనివాస్ ,నరసింహా పాల్గొన్నారు.

# గ్రామీణ ఆరోగ్యానికి భరోసా ఆర్‌ఎంపీ, పీఎంపీలే

**ఆర్‌ఎంపీ, పీఎంపీలు లేని గ్రామీణ సమాజాన్ని ఊహించుకోలేం.. వారిపై దాడులు సరికాదు**
**గ్రామీణ వైద్యులు సేవలు నిలిపేస్తే ఆరోగ్య వ్యవస్థ స్థంభించే ప్రమాదం.. ప్రభుత్వం వారికి తోడ్పాటు అందించాలి**
**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు**
**12 ఏళ్ల పాలన నేపథ్యంలో మానకొండూరులో ఆర్‌ఎంపీ, పీఎంపీలతో కేంద్ర మంత్రి "చాయ్ పే చర్చ"**
**తమపై దాడులను అరికట్టాలని కేంద్ర మంత్రికి ఆర్‌ఎంపీల వినతి**

గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఆర్‌ఎంపీ, పీఎంపీలేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్‌ఎంపీ, పీఎంపీలు లేని గ్రామీణ సమాజాన్ని ఊహించుకోలేమని చెప్పారు. అలాంటి వారిపై దాడులు చేయడం సరికాదని, ప్రభుత్వం ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని కోరారు. గ్రామీణ వైద్యులు సేవలు నిలిపేస్తే ఆరోగ్య వ్యవస్థ స్థంభించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రధాని నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు ఉదయం మానకొండూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆర్‌ఎంపీ, పీఎంపీలతో "చాయ్ పే చర్చ" కార్యక్రమాన్ని నిర్వహించారు. మోదీ 12 ఏళ్ల పాలనలో సాధించిన విజయాలను, ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. సమాజంలో అట్టడుగునున్న చిట్ట చివరి వ్యక్తికి సైతం సంక్షేమ ఫలాలు అందించడమే బీజేపీ సిద్దాంతమని, తూ.చ తప్పకుండా అమలు చేస్తున్న మహనీయుడు మోదీ అని కొనియాడారు. మోదీ పాలనా విజయాలను వివరించడంతోపాటు ప్రజలకు మరింత మేలు చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అవసరమైన సలహాలు సూచనలు తీసుకునేందుకు "చాయ్ పే చర్చ" వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్‌ఎంపీ, పీఎంపీ డాక్టర్లు ఫీల్డులో తమకు ఎదురవుతున్న సమస్యలను ఏకరవు పెట్టారు. కొంత మంది కావాలని తమపై అకారణంగా దాడులు చేస్తున్నారని వాపోయారు. తమపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. మానకొండూరు నియోజకవర్గంలో ఆర్‌ఎంపీ, పీఎంపీ డాక్టర్ల అసోసియేషన్ సంఘ భవనం లేదని, నూతన భవన నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని విజ&ఝప్తి చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఆర్‌ఎంపీలపై దాడులను ఖండించారు. "ఆర్‌ఎంపీ, పీఎంపీలతో సమాజానికి మంచి జరుగుతోందే తప్ప నష్టం జరగడం లేదు. తక్కువ ఖర్చుతో కుటుంబ సభ్యుల్లా మెలుగుతూ వైద్య సేవ అందిస్తున్నది ఆర్‌ఎంపీలే. ఆర్‌ఎంపీలు



లేని సమాజాన్ని ప్రజలు ఊహించుకోలేరు. అలాంటి వారిపై దాడులు చేయడం సమర్ధనీయం కాదు. ఆర్‌ఎంపీలు 10 రోజులు తమ సేవలను నిలిపివేస్తే గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ పూర్తిగా స్థంభించిపోవడం ఖాయం. గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నది ఆర్‌ఎంపీలే." అని చెప్పారు. మోదీ పనితీరు గురించి మాట్లాడుతూ... "మోదీ విజన్ ఉన్న నేత. 10 ఏళ్ల ముందు ఈ దేశం ఎలా ఉంటుందో ఆలోచించి అందుకు అనుగుణంగా కార్యక్రమాలు చేపడతారు. డిజిటల్ విప్లవం అందులో భాగమే. 10 ఏళ్ల ముందు జన్ ధన్ ఖాతాలను ఓపెన్ చేసి డిజిటల్ లావా దేవీలను ప్రారంభిస్తే అందరూ హేళన చేశారు. ఇయాళ ఏమైంది? రోడ్డుపై చాయ్ అమ్ముకునే వ్యాపారాలు కూడా ఫోన్ పే, గూగుల్ పే ద్వారా లావా దేవీలు జరుపుతున్నారు. ఒక్క రూపాయి అవినీతికి తావు లేకుండా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదును దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్దిదారుడి ఖాతాలోనే పడుతోంది."అని చెప్పారు. 12 ఏళ్ల పాలనలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో జరిగిన అభివృద్ధిపైనా మాట్లాడారు. తన ఏడేళ్ల ఎంపీ పదవీ కాలంలో రూ.22 వేల కోట్లకు పైగా నిధులొచ్చాయన్నారు. విద్య, వైద్య, మౌలిక సదుపాయాల రంగాలకు పెద్ద ఎత్తున నిధులిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలోనూ బీజేపీ సర్కార్ వస్తే... కేంద్ర నిధులు దుర్వినియోగం కాకుండా ఉంటాయన్నారు. "మా ప్రాధాన్యత విద్య, వైద్యం. పేద వాడికి కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తాం. మానకొండూరు లో ఆర్‌ఎంపీ, పీఎంపీ డాక్టర్లకు సంక్షేమ భవన్ విషయంలో ల్యాండ్ చూపిస్తే సంఘ భవన నిర్మాణానికి తప్పకుండా ఆర్థిక సాయం అందిస్తా."అని చెప్పారు. అందరికీ ఇచ్చారు అధికారం... ఈసారి బీజేపీకి ఇవ్వండి అవకాశం అంటూ అభ్యర్థించారు.

# బాధితుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

**ప్రతి కేసు వివరాలను సకాలంలో సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలి**
**పోలీసు అధికారులు క్రమం తప్పకుండా గ్రామాలను సందర్శించాలి**
**నూతన సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలి**
**శాంతిభద్రతల పరిరక్షణలో వనపర్తి జిల్లా పోలీసుల పనితీరుపై ఐజీపీ ప్రశంసలు**
**వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో ఐజిపి సమీక్ష సమావేశం**

**వనపర్తి** : ప్రజలకు న్యాయం అందించడంలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తుందని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునికి పోలీసులు అండగా ఉన్నారనే నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ప్రతి పోలీసు అధికారిపై ఉందని మల్టీ జోన్-2 హైదరాబాద్ ఐజీపీ షానవాజ్ ఖాసీం, పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఓర్పుతో విని, సత్వర పరిష్కార చర్యలు చేపడుతూ మర్యాదపూర్వకంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించడం ద్వారా పోలీసు-ప్రజా సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆయన తెలిపారు.వనపర్తి జూన్ -16: మంగళవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఐజీపీ శ్రీ షానవాజ్ ఖాసీం, ఐపీఎస్., , జోగులాంబ జోన్-7 డీఐజీ శ్రీ ఎల్.ఎస్. చౌహాన్, తో కలిసి సందర్శించి జిల్లా పోలీసు పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్., ఐజీపీ, డీఐజీ గార్లకు పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఐజీపీ సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.తదుపరి జిల్లాలో నమోదైన యూఐ, గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ, పోక్సో, కాంటెస్టెడ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్ష సందర్భంగా ఐజీపీ మాట్లాడుతూ... పోక్సో మరియు ఎస్సీ/ఎస్టీ కేసుల్లో 60 రోజులలోపు దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. ప్రతి కేసుకు స్పష్టమైన "ప్లాన్ ఆఫ్ యాక్షన్" ఉండాలని, రౌడీ షీటర్లు, కేడీలు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు.విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించాలని, రాత్రి గస్తీని మరింత పటిష్టం చేయాలని పేర్కొన్నారు. లాడ్జీలు, పాత నేరస్తులపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.గ్రామాల సందర్శనలకు ప్రాధాన్యత పోలీసు అధికారులు, వీఆర్వోలు, బీట్ అధికారులు క్రమం



తప్పకుండా గ్రామాలను సందర్శిస్తూ అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సీసీటీఎన్ఎస్ డేటా ఎంట్రీపై ప్రత్యేక దృష్టి పోలీస్ స్టేషన్ రికార్డులను నిరంతరం నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా ప్రతి కేసు వివరాలను సీసీటీఎన్ఎస్‌లో సకాలంలో నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రికార్డుల నిర్వహణలో 5ఎస్ విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాల నివారణకు చర్యలు సాయంత్రం వేళల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని, రాత్రి గస్తీల ద్వారా ఆర్థిక నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసుల పనితీరుపై ప్రశంసలు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్ చేపడుతున్న చర్యలపై ఐజీపీ సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం వనపర్తి జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించారు వనపర్తి డిఎస్పీ, శ్రీ గిరిబాబు ఐజిపి గారికి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు,అనంతరం ఐజిపి డిఎస్పీ కార్యాలయంలో మొక్కలు నాటారు. గతంలో వనపర్తి ఏఎస్పీగా పనిచేసిన రోజుల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) రాజేష్ మీనా, ఐపీఎస్, ఏఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, వనపర్తి డీఎస్పీ, గిరిబాబు, జిల్లా పోలీసు కార్యాలయ ఏఓ,సునంద, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, వనపర్తి సీఐ, సుగంధ రత్నం, కొత్తకోట సీఐ, రాంబాబు, ఆత్మకూరు సీఐ, శివకుమార్, సీసీఎస్ సీఐ, అశోక్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో పాటు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, జిల్లా పోలీసు కార్యాలయ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హిందూ, ముస్లిం స్మశాన వాటికల అభివృద్ధికి శ్రీకారం





**అల్వాల్, జూన్ 16 : ప్రజా జ్యోతి** తుర్కపల్లి 190 డివిజన్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. అల్వాల్ సర్కిల్ పరిధిలోని తుర్కపల్లి హిందూ స్మశాన వాటిక, బంధంబావి ముస్లిం స్మశాన వాటిక అభివృద్ధి పనులకు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మంగళవారం శ్రీకారం చుట్టారు. తుర్కపల్లి డివిజన్‌లోని హిందూ స్మశాన వాటికలో రూ.17 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ పనుల్లో కాంపౌండ్ వాల్ ఎత్తు పెంపు, మరమ్మతులు, అస్థికల గది నిర్మాణం, టాయిలెట్ల ఏర్పాటు, బర్నింగ్ షెడ్ నిర్మాణం వంటి పనులు చేపట్టనున్నారు. అదేవిధంగా బంధంబావి ముస్లిం స్మశాన వాటికలో రూ.48.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రహరీ గోడ పనులకు కూడా ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని వర్గాల వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. స్మశాన వాటికల అభివృద్ధితో ప్రజలకు గౌరవప్రదమైన అంత్యక్రియల నిర్వహణకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ సర్కిల్ డిప్యూటీ ఇంజనీర్ మహేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అఫ్రోజ్, బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, శోభన్ బాబు, భాస్కర్ రెడ్డి, శరణగిరి, ఆరిఫ్, రెహ్మత్ ఖాన్, స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, ముస్లిం సోదరులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## 12 ఏళ్లలో ఎమ్మెల్యే చేయలేనిది..

## బీజేపీ కృషితో 4 కోట్ల స్కూల్ నిర్మాణం!

**మదీనాగూడా ప్రభుత్వ పాఠశాల పునర్నిర్మాణానికి భూమిపూజ**
**విర్టూసా ఫౌండేషన్ సి.ఎస్.ఆర్ నిధులతో ఆధునిక భవనం**
**ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ నేత రవికుమార్ యాదవ్ పాల్గొనడం**

**శేరిలింగంపల్లి:** హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడా గ్రామంలో ప్రభుత్వ మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాల పునర్నిర్మాణానికి మంగళవారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. విర్టూసా (ఎతితీబిబీబజీ) ఫౌండేషన్ సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ నిర్మాణ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్, కంపెనీ ప్రతినిధులు, స్థానిక ప్రజలు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సి.ఎస్.ఆర్ నిధులను వినియోగించేందుకు ముందుకు వచ్చిన విర్టూసా ఫౌండేషన్‌ను అభినందించారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు అందించేందుకు కార్పొరేట్ సంస్థలు మరింత బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. "12 సంవత్సరాలుగా స్థానిక ఎమ్మెల్యే చేయలేని పనిని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మార్గదర్శకత్వంలో బీజేపీ నాయకుల కృషితో సాధించగలిగాం. బీజేపీ మాటలతో కాదు.. చేతలతో చేసి చూపించే పార్టీ. మదీనాగూడా పాఠశాల పునర్నిర్మాణం ఇందుకు నిదర్శనం" అని అన్నారు.శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మరిన్ని సంస్థలు సి.ఎస్.ఆర్ నిధులతో ముందుకు రావాలని ఆయన కోరారు. కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో సమావేశమై ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమం సందర్భంగా స్థానిక ప్రజలు మదీనాగూడా పాఠశాలలో 10వ తరగతి వరకు తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు. దీనిపై స్పందించిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంబంధిత ప్రభుత్వ అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోయిని మహేష్ యాదవ్, ఫౌండేషన్ సభ్యులు కృష్ణ ఎద్దుల, వాసు, ఇందార్, పూజా, సుబ్బారావు, సురేష్ బాబు, అరుణ, కేవీ, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జితేందర్, సురేష్ యాదవ్, కుమార్ యాదవ్, విజయేందర్, పద్మ, వినయ, బిందు, శ్రీనివాస్ యాదవ్, మనోజ్, ప్రసాద్ రెడ్డి, శ్రీశైలం కురుమ, పార్వతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## సన్న వడ్ల రైతులకు సర్కార్ గుడ్‌న్యూస్..

**వ్యవసాయ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు!**

**హైదరాబాద్ :** తెలంగాణలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వ్యవసాయ శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సాంకేతికత వినియోగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలో బోనస్ అందించే ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందించడంతో పాటు రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని ఆదేశించారు. సన్న వడ్లు పండించే రైతుల పూర్తి వివరాలను సేకరించాలని, ధాన్యం దిగుబడులపై వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని పేర్కొన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో అమలు చేస్తున్న పైలెట్ ప్రాజెక్టును మరింత విస్తరించాలని ముఖ్యమంత్రి సూచించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగాన్ని పెంచాలని, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)ను వ్యవసాయ సేవల్లో ఉపయోగించాలని చెప్పారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని నోడల్ ఏజెన్సీగా నియమించి, విత్తనాల సరఫరా నుంచి ధాన్యం కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, ఆయిల్‌ఫెడ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు.

## మహిళా లెక్చరర్‌కు అసభ్యకర మెసేజ్‌లు..

**సీన్‌కట్‌చేస్తే.. కాంట్రాక్టర్ కుమారుడికి ఊహించని షాక్..**

**మెదక్ :** మెదక్ జిల్లా కౌడిపల్లిలోని దారుణం వెలుగు చూసింది. స్థానికంగా గిరిజన గురుకుల కాలేజీలో విధులు నిర్లవహిస్తున్న లెక్చరర్‌పై కన్నేసిన క్యాటరింగ్ కాంట్రాక్టర్ కుమారుడు.. ఆమెను వేధింపులకు గురి చేయడంతో పాటు దాడికి కూడా పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.మెదక్ జిల్లా కౌడిపల్లిలోని గిరిజన గురుకుల కాలేజీలో దారుణం చోటు చేసుకుంది. విద్యాబుద్ధులు నేర్పే మహిళా లెక్చరర్‌కే రక్షణ కరువైంది. గత ఆరు నెలలుగా ఓ కిరాతకుడు ఆమెను మానసికంగా వేధిస్తూ, చివరకు కాలేజీలోనే ఆమెపై భౌతిక దాడికి తెగబడ్డాడు. క్యాటరింగ్ కాంట్రాక్టర్ కుమారుడి ఆగడాలపై బాధితురాలు కౌడిపల్లి పోలీసులను ఆశ్రయించింది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com